# వర్షించని మేఘాలు

ఎదురుగాలి వీస్తూవుంది గాలికి కిటికీ రెక్కలు టపటపా కొట్టుకుంటున్నాయి. కుర్చీలోంచి లేచి, గడియపెట్టాలని కిటికీ రెక్కని పట్టుకున్నాను. చిక్కకుండా వెనక్కుపోయింది. దూరంగా ఎక్కడో పిడుగుపడ్డ శబ్దం విన్పించింది. ఆ భయంకరమైన శబ్దాన్ని వినలేక పోయాను. మరికొంచెం సేపటికి ఓ మెరపుతీగ కన్పించింది. మళ్ళీ మేఘాలు గర్జిస్తాయని అనుకున్నాను. ఎలాగయితేనేం కిటికీ తలుపుమూసి కూర్చున్నాను.

ఫ్లాస్కులోంచి వేడికాఫీ కప్పులో పోసుకుని మెల్లగా ఒక్కొక్కగుక్క చప్పరిస్తూ సిగరెట్టు ముట్టించాను. గుండెకు వేడితాకి ఎంతో హాయనిపించింది. అంతకుముందు ఓ అర గంట క్రితమే పొలం వెళ్లాలని అనుకున్నాను. కాని అంతలోనే వాన వచ్చింది. ముసురుగా కాకపోయినా అప్పుడప్పుడు తెరిపిస్తూనే వాన మూడు రోజులుగా కురుస్తూనే వుంది. చేతికున్న గడియారాన్ని చూసాను. పోస్టువచ్చే టైమయింది. అయినా ఇంతవానలో పోస్టుమేన్ వుత్తరాలివ్వటానికి వస్తాడోలేదో. అలస్యంగా వస్తాడేమోననుకోంగానే మనస్సులో నిరుత్సాహం వచ్చేసింది. సరిగ్గా పోస్టువచ్చే సమయానికి నే నెక్కడికీ ఇంటినుంచి కదలను. కాని ఇవ్వాళ మాత్రం ఈ సమయానికి పొలంలో నాట్లు వేస్తుంటే చూద్దా

మని వెళ్దామనుకున్నాను. అనుకున్నానే కాని వర్షం నన్ను బయటికి వెళ్ళనీయలేదు.

కప్పులో కాఫీ అయిపోయాయి. ఫ్లాస్కునుంచి ఇంకొంచెం పోసుకున్నాను. దమ్ము పీల్చక కొడిగట్టిన సిగరెట్టును మళ్ళీ వెలిగించాను.

"బాబూ, ఇవ్వాళ మీకెన్ని ఉత్తరాలొచ్చాయో చూడండంటూ" భీమన్న నాచేతినిండా వుత్తరాలిస్తే ఎంత బాగుంటుంది. ఈ ఒంటరి జీవితానికి స్నేహితులే లేకుంటే, వాళ్ళు కథల్లా రాసే వుత్తరాలే రాకుంటే, ప్రతిక్షణం ఆ వుత్తరాలు నాకు ధైర్యాన్ని, జీవించాలన్న ఆశను కల్పించక పోతే ఈపాటికి నాజీవితం ఎప్పుడో అంతమయే వుండేది. తరతరలుగా సోమరి పోతుల్లా కూర్చుని ఎంతమందితిన్నా తరిగిపోని ఆస్థి, ఇతరుల సేవచేయటానికి పనికివచ్చే డాక్టరు పట్టా, సంఘంలో వుండే గౌరవం, హోదా ఇవన్నీ నాజీవితానికో అర్థమంటూ తెలపలేదు. నాజీవితంలో ఏనాడు అవి ఆనందానివ్వలేదు. ఈనాడింకా నేను బ్రతికే వున్నానంటే కేవలం స్నేహితులకోసం, వాళ్ళ మంచి మనస్సుల కోసం, వాళ్ళు నాజీవితంలో కురిపించే వెన్నెలకోసం. అందుకని మాత్రమే వాళ్ళదగ్గరనుంచి వచ్చే వుత్తరాలకోసం నేను పడిగాపులు కాచుకొని ఎదురు చూడటం అలా ఎదురు చూడటంలోని ఆనందం, వుత్తరాలొచ్చినపుడు నా మనస్సెంత పరవళ్ళు తొక్కుతుందో మాటల్లో నేను చెప్పలేను.

ఉన్నట్టుండి ఎందుకనో రాముడు గుర్తువచ్చేడు. రెండు చేతులు గట్టిగా కట్టుకుని దీనంగా నావైపే చూసే వాడి ముఖం, నన్నెలాగయినా వాడితో వాడింటికి తీసుకువెళ్లాలన్న వాడి పట్టుదల, తీసుకు వెళ్ళకపోతే ఏమవుతుందోనన్న ఆతృత నాకళ్ళలో ఇంకా మెదులుతూనే వుంది. అయినా ఇంతలోనే మర్చిపోటానికి కనీసం ఓ గంటకయినా ఎక్కువ కాలేదుకదూ రాముడువచ్చి.

"బాబూ .... డాక్టరుబాబూ తమరే నాసీతను రక్షించాలి" వచ్చిన వెంటనే నాకాళ్ళను తాకబోయాడురాముడు. రాముడెందుకొచ్చాడో నాకు అర్థంగాకపోయినా, వాడిరాకకు కారణం ఏదయినా వాడు నాకాళ్ళను తాకటం ... అందులోనూ వయసులో నాతాతలాంటి రాముడు వంగి నాపాదాలకు నమస్కరించడం నాకేమాత్రం నచ్చలేదు. అలాంటి పనులంటే నాకు బొత్తిగా గిట్టదు.

"ఏం రాముడూ ఏమయింది." చేతుల్తో వాడిని పైకి లేపుతూ అడిగేను. "ఏమో బాబూ ప్రొద్దునుంచి అది మూసినకన్ను తెరవనేలేదు. నిన్నటినుంచి ఒకటే వాంతులు, ఇవ్వాళ ప్రొద్దున్నే చేతులు కూడా చల్లబడ్డాయి. దాన్ని చూస్తుంటే అసలు ప్రాణానికే ముప్పు వస్తుందేమోనని అనుమానంగావుంది బాబూ. డాక్టరుబాబూ ఎలాగైనా దాన్ని రక్షించండి. చచ్చి మీకడుపున పుడతాను" వాడి కళ్ళవెంట ధార ఆగకుండా ప్రవహిస్తోంది.

కాని రాముడికి జవాబు చెప్పాలనిపించలేదు.

శూన్యంలో కలానే చూస్తూ నుంచునుండి పోయాను.

నా నోటివెంట ఏమాట రాకపోవటం, మనసులోని తొందరకు ఏకమై ఏమీ తోచని స్థితిలో రాముడు నావైపే తదేక ధ్యానంతో చూస్తున్నాడు. మధ్యమధ్యన ఏదో చెప్పానని ప్రయత్నిస్తున్నాడు. కాని నోటివెంట మాట పెగిలి రావటం లేదు. చెక్కిలిమీద కారే కంటి నీటిని పంచెఅంచుతో తుడుచుకుంటూ చివరికెలాగయితేనేం ఒక్కొక్క మాటకు మధ్యమధ్య సందిస్తూ అన్నాడు,

'బాబుగారు....నోరూ వాయీ లేని పసిపిల్లలు పది. మంది బాబూ. నేనేదో కాయకష్టం చేస్తూంటే వాళ్ళకడుపులు గాలితో నయినా నింపి ఎలాగోలా బ్రతికిస్తోంది వాళ్ళను ఈ రోజున అదే నాకు దక్కకపోతే ఈ పిల్లలంతా చెట్టుకొకడు పుట్టకొకడు అయిపోతారు బాబూ. మీరు త్వరగా బయలుదేరండి .... దానికెలా వుందో ఏమో. మీకు చెయ్యెత్తి మొక్కుతున్నా బాబూ" రాముడలా చెప్తూవుంటే చిన్నప్పుడే కాలును పోగొట్టుకున్న వాడి పెద్దకొడుకు చిన్నప్ప నాస్మృతి పథంలో మెలిగేడు. వాడు బ్రతికున్నంత కాలం ఎవరిమీదనో ఆధారపడి జీవించాల్సినవాడే. వాడికి తోడు కనీసం తింటానికి ఇంతగంజి కట్టుకోటానికి ఓచింకిపాతయినా లేకుండా ఎలా బ్రతుకుతున్నారో అర్థంగాని వాడి మిగతా పిల్లలు కూడా

గుర్తువచ్చేరు. కాని జాలిపడటం మినహా నేను చేయగలిగింది ఏమిటి?

“ఏం బాబూ ఇంకా ఆలోచిస్తూనే వున్నారా? ఓహో బయట వర్షంగా వుందనా మీ అభిప్రాయం. వర్షం గురించి ఆలస్యం చెయ్యొద్దు బాబూ. ఈవర్షం ఆగకపోయినా దాని ప్రాణం మాత్రం ఆగిపోతుందిబాబూ. బయలుదేరండి రవి బాబుగారు”. రాముడు పేరుపెట్టి సంబోధించటం అదే ప్రథమం.

కాని వాడికి తెలియదు.... నామనస్సెంత పాషాణమో వాడికి తెలియదు. జాలికి కరగని సీసపుగుండె లోతుమాత్రం వాడు అంచనా వేయగలడా! చివరకు ఏమి చెయ్యాలో అర్థంగాక మాత్రం అన్నాను.

“రాముడూ, అందరికీ సేవచేయాలన్న అభిమతంతో ఓ డాక్టరుకోర్సు చదివేను. కాదనను. కాని ఈవూళ్లో ఎవరి కయినా, ఎప్పుడైనా మందులివ్వటం చూసావా నువ్వు. కనీసం ఇస్తున్నట్లయినా విన్నావా .... లేదురాముడూ లేదు. నే నెవ్వరికీ మందు ఇవ్వలేను. నామందు లెవ్వరికీ పనిచేయవు. నేనెవ్వరినీ బ్రతికించలేనని కూడా నాకు తెలుసు. అసలు నా చెయ్యే మంచిదికాదు. అందువల్ల ఈరోజున నువ్వొచ్చి బల వంతపెట్టినా, సీతకు వైద్యసహాయం అత్యవసరమైనా నేను చేసేది మాత్రం ఏమీలేదు. వెళ్ళురాముడూ .... సమయం

మించిపోకముందే ఎవరైనా పెద్దడాక్టరు వస్తాడేమోచూడు లేకపోతే సీతనే గుంటూరు తీసుకెళ్ళి ఆస్పత్రిలో చేర్పించు”.

కాని రాముడు కదలలేదు. ఇంకా ఏదో ఆశ వాడి కన్నుల్లో కన్పిస్తూవుంది.

“లేదుబాబూ, మీ మీదనే నానమ్మకం. మీ చెయ్యే కాదు, మీచల్లటి మాటలు వింటేనే పోయే ప్రాణం తిరిగి వస్తుంది. మీరొక్కసారి మా ఇంటికొచ్చి సీతను పలకరిస్తే చాలు. అదిలేచి తిరుగుతుంది బాబూ.... లేచి తిరుగుతుంది. సీతనెలాగయినా బ్రతికించి మాఇంటి దీపాన్ని నిలబెట్టండి”.

రాముడు చెప్పేది చెప్పబోయేది నాచెవుల్లోకిమాత్రం దూరదు. అక్కడ నిలబడటం ఇష్టంలేక లోపలికి నేను పోయే టప్పుడు రాముడు భీమన్నతో అనే మాటలు విన్పించాయి.

“ఆయన రవిబాబేనా అనిపిస్తోంది భీముడూ! బాబు గారు ఎంతచెప్పినా వినుకోరేమిట్రా. ప్రాణాలమీదకొచ్చినా ఆయనకేమాత్రం జాలికలగలేదంటే, అంత మొండికేసారంటే ఆయన చదివిన చదువు సార్థక మవుతుందనా ఏమిటి? అయినా దాన్ని దేవుడే రక్షించాలి” మాటలతోపాటు రాముడు పెద్దగా ఏడుస్తున్నట్లుకూడా విన్పిస్తోంది.

“ఎందుకురా రాముడు అంతనీరు కారిపోతావు. మా బాబుగారెంత మందిని కాదన్నారో నీకు మాత్రం తెలి

యదూ? వైద్యం తప్పించి ఏదడిగినా మరోప్రశ్న వేయకుండా చేస్తారే.... మరి ఆమారాజుకు ఇదేంబుదో ఎవరికి మాత్రం ఏం తెలుసు. అదిసరేగాని వెంటనే సీతను ఓ పెద్ద డాక్టరుకు చూపించు. చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏంవుంటుంది అందుకని డబ్బుకోసం మాత్రం వెనక్కుపోకు. ఎంతడబ్బు అవసరమొచ్చినా బాబుగారి దగ్గరనుంచి నేను తీసుకొచ్చి ఇస్తానీకు"...తర్వాత ఏం మాట్లాడుకున్నారో నాకు మాత్రం విన్పించలేదు.

ఇనప్పెట్టె తలుపులు తెరిచేను. కళ్ళకెదురు గుండా కట్టలు కన్పించాయి. లెక్కపెట్టకుండానే ఒకకట్ట చేతిలోతీసుకున్నాను. ఎదురుగా నావైపే వస్తూండే భీమన్న కన్పించాడు. దగ్గరకు రాంగానే భీమన్న చేతిలో డబ్బువుంచుతూ అన్నాను. "దీన్ని రాముడికిచ్చిరా? సరిపోకపోతే సందేహించకుండా అడగమను. మళ్ళీ ఇస్తాను."

భీమన్న ఆనోట్లు మళ్ళీ నాచేతిలోనే పెడుతూ అన్నాడు "వద్దుబాబూ, వీటిఅవసరం మరిలేదనుకుంటాను. నేనక్కడికీ బ్రతిమిలాడేచెప్పాను డబ్బుకోసం వెనకాడకు, మనకు ముఖ్యంగా సీత బ్రతికటం కావాలని, కాని ఎంత చెప్పినా వినకుండా ఆడబ్బు నన్ను సీతను కాపాడుతుందా, బాబుగారు కనీసం చూడ్డానికయినా రాలేకపోయినప్పుడు వారిడబ్బు నన్నేం వుద్ధరిస్తుందని నిషూరంగా వెళ్ళిపోయాడు బాబూ."

నోట్లను మళ్ళీ ఇనప్పెట్టెలోనే వుంచి తాళం వేస్తూ అనుకున్నాను. "మానవత్వంముందు నీవిలువెంత. అన్ని కాలాల్లోనూ, కనీసం కొందరినయినా నువ్వుజయించలేవు. పైగా వారి అభిమానానికి కూడా అడ్డురాలేవు." ముఖం మీద కన్పించిన చిరునవ్వుకు బహుశా అర్థం దొరికి వుండదు భీమన్నకు. సిగరెట్టు కొనకంటూ కాలినట్లుంది, వ్రేళ్ళు చుర్రుమన్నాయి. కాలగా మిగిలిన చిన్నముక్కను దూరంగా విసిరిపారవేశాను. ఎవరో వస్తున్న అలికిడివిని తలపైకెత్తి చూసాను. భీమన్న నవ్వుముఖంతో చేతినిండా వుత్తరాలు పట్టకొని నావైపే వస్తూ కన్పించాడు. కుర్చీలోంచి లేచి ఎదురువెళ్ళి ఆవుత్తరాలని తీసుకున్నాను. ఉత్తరాలుకన్పించ గానే ఎక్కడి ఆలోచనలక్కడ ఆగిపోయాయి ఒక్కసారిగా.

కుర్చీలో కూర్చుని వుత్తరాల మీద అడ్రసులను తీరిగ్గా చూడటం ప్రారంభించాను. నా కళ్ళు వున్నట్లుండి ఒక కవరుమీద కేంద్రీకృతమయ్యాయి. దస్తూరి కొత్తగా వుంది, ఎవరు రాసివుంటారా అని ఆలోచించాను. అటువంటి దస్తూరి కనీసం ఎప్పుడు చూసినట్లయినా గుర్తులేదు నాకు. అడ్రసు మాత్రం ఖచ్చితంగానే వుంది. అయినా యింతసేపు వృథా ఆలోచనెందుకు, చించిచూస్తే అదే తెలుస్తుందిగదా అనుకొని వుత్తరాన్ని చించి లోపలి కాగితాన్ని పైకితీసాను. ఆ సంబోధన చూడగానే వున్నట్లుండి వుత్తరం ఎవరు రాసి

వుంటారో అర్థమయింది. అయినా అంత ఆప్యాయంగా నన్ను పిలవగలవాళ్ళు మాత్రం మరింకెవరుంటారు కమల తప్పించి. కమల వుద్యోగరీత్యా ఒక 'నర్సే' కావచ్చు కాని ఏనాడు ఆమెను నేను సిస్టర్' అనిగాని 'నర్స్' అనిగాని పిలవలేదు; అలా అనలేనుకూడా. ఎందుకనో కమలను అలా పిలవాలంటే మనస్సు చాలాబాధ పడుతుంది.

ఉత్తరంలోని ప్రతి అక్షరాన్ని పరీక్షగా చూడటం ప్రారంభించాను.

డాక్టర్ అన్నయ్యకు,

బహుశా ఈవుత్తరాన్ని చూసిన వెంటనే మీకెవ్వరు రాసారా అని ఆలోచించవచ్చు. చేతి దస్తూరి నన్ను మీకు గుర్తు చేయకపోయినా ఈసరికి నేనెవ్వరో మీకు తెలిసే వుంటుంది. మీకు నేను కమలగా ఆనాటిరాత్రి సంఘటన మీమనస్సునుండి మాయమవనంతవరకు, ఆనాటి బాధ మీలో మిగిలివున్నంతవరకు, గుర్తువుంటానన్న నమ్మకం నాలోవుంది. మీజీవితంలో రాకూడని మార్పుకు కారణమై మీలో చెరగని ముద్రవేసిన ఆనాటి సంఘటనలో నాపాత్ర ఏమీ లేకపోయినా ఎందుకనో నన్ను మర్చిపోలేరనేది నా విశ్వాసం. అయినా ఈరెండేళ్ళలోను మీకంత మతిమరుపు వచ్చివుంటుందని వూహించటం నాకు చేతకానిపని.

మీరానాడు రాత్రి మీ అడ్రసు నాకిస్తూ "కమలా వుత్తరాలు రాస్తూవుండు" అని అన్నారు. కాని మీదగ్గర అతి

చనువు, మీకు రాయదగ్గ అనేక సంగతులూ వున్నా ఈ రెండేళ్ళలో నేనెప్పుడూ మీకు వుత్తరం రాయనేలేదు. దానికి కారణమంటూ మాత్రం ఏమీలేదు. బద్ధకంవేసికూడా కాదు. బహుశా ఈ విషయంలో మీకు కోపం వచ్చివున్నా బాధ పడినా నన్నుక్షమించ గలరన్న సమ్మకం వున్నదినాకు.

ఈరెండేళ్ళు మీకెలా గడిచాయో నా వూహకందని విషయం అందుకనే ఏమీరాయకపోవచ్చు. కాని మిమ్మల్ని క్షణంసేపు ఆలోచించకుండా గడపలేదు నేను. మీ ఆలోచనలు రాకుండా గడపగల సామర్థ్యం నాలోలేదు. అంతఅవసరమూ లేదనుకోండి. ఇన్నేళ్ళ ఈ మౌనం తర్వాత, వున్నట్లుండి ఈరోజున ఇలా నేను వుత్తరం రాయటానికి కారణమేమిటో, ఈపాటికి మీమనస్సుని వేధిస్తూనే వుంటుంది. మిమ్మల్ని ఇంకా ఆతృతతో వుంచదలచలేదు నేను.

పాత విషయాలను మీకు పదే పదే జ్ఞాపకం చేయటం నాకంతగా ఇష్టంలేకపోయినా మీరు నాతో పరిచయమైన మొట్టమొదటిరాత్రి ఏమన్నారో గుర్తువుందా? "కమలా నారక్తం పంచుకొని ఆమె కడుపున ఓకాయు కాస్తే నాకంత కన్నా కావలిసిందేమిటి. వాడితోనే ఆడుకుంటూ ఈజీవితాన్ని ఆనందంగా గడిపి వేద్దామని వుండేది." ఆ 'ఆమె' ఎవరో నేను మీకు వేరే రాయనక్కరలేదు.

అసలు విషయం చెప్పేముందు నా విషయంకూడా చెప్పుకోవాలినేను. మీరెళ్ళిన రెండునెలలకే నాకు పెళ్ళయింది. నా పెళ్ళికి రావలసిందని నేను పంపిన ఆహ్వానం మళ్ళీనాకే తిరిగి రావటం చూసి ఆనాడే అనుకున్నాను మీరింకా కోలుకే లేదని, మామూలు మనిషిగా మారలేదని. మీకు ఏమాత్రం శాంతి దొరికినా మీరిచ్చిన అడ్రసు ప్రకారం ఇంటిదగ్గరేవుండి వుండేవాళ్ళు. ఒకవేళ ఇంటిదగ్గరే వున్నట్లయితే నా పెళ్ళికి రాకుండా వుండగలిగే వాళ్ళేనా? ఆహ్వానం అందిన మరు క్షణమే నాదగ్గరకు రెక్కలు కట్టుకొని వచ్చి వాలివుండే వారు. మీరు రాలేదన్న బాధకంటే మీరు బాగుపడలేదన్న బాధ నన్ను మరీ కృంగ దీసింది.

'మావారికీమధ్యనే గుంటూరు ట్రాన్సఫరయింది. వారితోపాటు నన్నుకూడా గుంటూరే మార్చారు. ఎందుకనో నాకు గుంటూరు వాతావరణం నచ్చలేదు. అందువల్ల హాస్పటల్లో పని చెయ్యాలంటే నాకు తలనొప్పిగా వుండేది. అందులో ఎప్పుడూ క్షణంసేపు తీరిక లేకుండా వుండే 'మెటర్నిటీ' వార్డులో నన్ను స్టాపునర్సుగా వేసారు. కష్టమయిన పనికితోడు ఇష్టంలేనిపని. ఆవార్డులో ప్రతిక్షణం నాకొక యుగంలా వుండేది. నాపనిమీద నాకేమాత్రం ఆసక్తిలేదు. ఒకరోజు రాత్రి నైటు డ్యూటీలో తొమ్మిది కాకముందే కునికిపాట్లు పడుతున్నాను.

"చూడండి సిస్టర్. ఈమె నా మిసెస్. ఈవార్డులోనే చేర్చారు. స్పెషల్స్‌లో ఖాళీ లేవట. పోనీ ఖాళీ అయిందాకా వుందామంటే అంతవరకు వేచివుండే కేసు కాదామెను. అందుకనే ఈ జనరల్ వార్డులోనే అడ్మిట్ చేయించాను. అసలే ఈమెకిది మొదటి కానుపు. పైగా భయపడి పోతోంది కూడాను. మీరేమనుకోకపోతే నాదొక చిన్నకోరిక. ఈమెను సొంత చెల్లెలుగా చూసుకోవాలి ...." నిద్రమత్తువదలి వూర కనే అదేపనిగా చెప్పుకుపోయే అతనివైపు చూసాను. ధన వంతుల్లాగనే కన్పించారు. వెంటనే నాకేదో గుర్తువచ్చింది. వాళ్ళనెక్కడో చూపినట్లు అనిపించిది. బుర్రగోక్కుంటూ ఆలోచించాను. ఎంత ఆలోచించినా గుర్తురాలేదు. మా నామికల్ రిజిస్టరులో పేరు రాసేటప్పుడు మాత్రం ఆమెపేరు చూసాను.

ఆపేరేమిటో రాయనా .... చదువుకుని తృప్తిపడవు కదూ?

పద్మ.... అవును పద్మే .... మీపద్మే. మీరుకాదను కున్నా మీపద్మే. ప్రక్కనే ఆమెభర్త భీమశంకరం.

మీరు ఒక డాక్టరేకావచ్చు. కాని ఎంతయినా మగ వారుమాత్రమే. అవునుకదూ? అందుకనే ఆరోజురాత్రిఆమెంత బాధపడిందో మీరు కనీసం వూహించలేరు. చచ్చిపోతే బాగుండునని ఎన్నోసార్లు అనుకుంది కూడాను. కాని చావే అంత తేలికయితే మనముందే ఎన్నో అమాయకజీవితాలు

నాశనమయి వుండేదికదూ! కాన్పుచాలా కష్టమయింది. చివరివరకు నేను ఆమె ప్రక్కనే వున్నాను. అంతాపూర్తయిన తర్వాతనన్సులో భగవంతునికి ధన్యవాదాలర్పించాను. నాతరుపున కాదు నీతరుపునేననుకో.

ఆమెప్రక్కనే ఏడ్చే ఆనెత్తురు గుడ్డును చూడగానే మీారన్న మాటలు గుర్తుకొచ్చాయి. మీారు వేరే విధంగా అనుకోకపోతే ఆపాప మీానెత్తురు పంచుకొనే పుట్టాడని అనిపించింది. మీానెత్తురు ఓ ప్రాణిని కాపాడక వుండివుండకపోతే ఈనాడు ఆపాప పుట్టివుండేవాడు కాదేమో. అందుకనే నా మాటల్లో నిజం కన్పించటం లేదామీాకు.

ఈవిషయం మీాకు రాద్దామా వద్దా అని చాలా రోజులు తీక్షణంగానే ఆలోచించాను. ఒకవిధంగా మీాకోరిక తీరింది. కాని ఎటొచ్చీ ఆపాపతో ఆడుకోవాలన్న మీాకోరిక అలానే మిగిలిపోవచ్చు నేనీ విషయం రాసినందువల్ల మీాలో పాత విషయాలన్ని బయటికివచ్చి మీామనస్సుని అల్లకల్లోలం చేస్తాయని తెలుసు. ఏవిషయాన్నయితే మర్చిపోటానికి మీారు ప్రయత్నిస్తున్నారో ఆవిషయాలను నేనే త్రవ్వి పైకితీసినట్లవుతుందని కూడా తెలుసు. అయినా మీానుండి ఈవిషయాన్ని దాయగల సామర్థ్యం మాత్రం నాకులేదు. అందుకనే...." వుత్తరం చదవటం పూర్తికాలేదు. ఇంతవరకు చదవగానే నాఆలోచన వున్నట్లుండి రెండేళ్ళు వెనక్కు

పోయింది. నాకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. ఉత్తరంలోని అక్షరాలు మసకమసగ్గా కన్పిస్తున్నాయి.

నాకింకా బాగా జ్ఞాపకం. జరిగి రెండేళ్ళు దాటినా అనుభవించిన ప్రతిక్షణం నా బుర్రలో చోటు చేసుకుని కూర్చుంది. వాటిని శాశ్వతంగా తుడిచివేయాలన్నా అది నాకు చేతకాని పనిమాత్రమే.

అవినేను నైటు డ్యూటీచేసే రోజులు. డాక్టరుగా నా బాధ్యతను నిర్వర్తించాల్సివున్నా, నిద్ర ఆపుకోవాలంటే సాధ్యంకాని రోజులవి. కళ్ళు మూతలు పడుతూవుంటే, చల్లని నీటితో కళ్లుతుడుచుకునే నన్ను చూచి సిస్టర్సునవ్వుతూ వుండేవాళ్ళు. నిద్రని పోగొట్టటానికి వాళ్ళతో సరదాగా కబుర్లు చెపుతూ కాలం గడిపేసేవాడిని కాఫీ, హోటల్నించి తెప్పించేవాడిని. మధ్యమధ్య రోగుల్ని చూసివస్తూ, అర్జెంటు కేసుల్ని ట్రీట్ చేస్తూవుంటే కాలం ఇట్టే అయిపోయేది. అంతకు క్రితం రాత్రి ఎమర్జన్సీ వుండటంవల్ల పూర్తిగా నిద్రలేక కళ్ళుమండి పోతున్నాయి. వార్డుబాయిని పిలిచి 'టీ' తెమ్మన్నాను. అంతలో రూంలోని ఫోను మ్రోగింది.

"ఎస్ డాక్టర్ రవి స్పీకింగ్" అన్నాను. ఏదో ఎమర్జెన్సీ వుందని వార్డునుంచి ఫోనువచ్చింది. వెళ్ళటం బద్ధకంగానే వుంది. కాని తప్పదనుకుని ముఖం కడుక్కుని టీ వస్తే వార్డుకే పంపించమని స్టెతస్కోపు వూపుకుంటూ వార్డువైపు బయలు దేరాను.

వార్డంతా నిశ్శబ్దంగానేవుంది. కాని ఎక్కడనుంచో మాత్రం అప్పుడప్పుడు మూలుగు వినిపిస్తోంది. ఒకడుమాత్రం కడుపు నొప్పితో ననుకుంటూను బాధపడిపోతున్నాడు మంచం మీదనే అటూఇటూ పుంగరాలు తిరిగి పోతున్నాడు. నేను వార్డులో ప్రవేశించేటప్పటికి సిస్టర్ నాకోసం ఎదురుచూస్తూ వుంది. ఏమిటన్నట్లు ఆమెవైపు చూసానేగాని నోటితో మాత్రం ఏమీ అడగలేదు. "ఆపేషెంటుకి వున్నట్లుండికడుపు నొప్పి వచ్చిందండి. అసలే అతనికి హార్టు ఫైల్యూర్ వుందట. ఊపిరిచాలా కష్టంగా పీల్చుతాడు. దానికితోడు ఈ కడుపు నొప్పొకటి వచ్చింది. ఓర్చుకోలేక పోతున్నాడు. రాను రాను ఆనొప్పికూడా ఎక్కువయి పోతోందట. నాకేభయంవేసింది. వెంటనే మీకోసం ఫోను చేసాను.... "గుక్కతిప్పుకోకుండా వున్నదంతా చెప్పి నాముఖంలోకే చూస్తూ ఆగింది.

అంతావిని ఆమెవైపు పరీక్షగా చూసాను. ఎప్పుడో ఎక్కడో, చూసినట్లనిపించింది. ఆమాట్లాడేతీరు, ఆచక్కటి పలువరస, మాట్లాడేటప్పుడు ముఖంలో కన్పించే ఆముడతలూ ఆబడ్డూ పొడుగూ.... అవును నిజంగా లక్ష్మిలాగనే వుంది. లక్ష్మికన్న కాస్త పొడుగనిపించే మాటకూడా నిజమేకావచ్చు. కాని లక్ష్మి ఈనాడే వుండివుంటే సరిగ్గా ఇంతే వుండివుండేది.

లక్ష్మిని తలచుకోగానే కళ్ళవెంట ఒకన్నీటి బొట్టు రాలింది. ముఖం ప్రక్కకు తిప్పుకుని ఆమెకు కన్పించకుండా

తుడుచుకున్నాను. నాకేమి తెలియని రోజుల్లో సలసలమని కాలిపోయే జ్వరంతో మనలోకంలోలేని లక్ష్మికి డాక్టరు ఏదో ఇంజక్షనియ్యబోతూవుంటే ఆయన రెండుచేతులు గట్టిగా పట్టుకొని బొంగురు గొంతుతో "నాచెల్లెలు బ్రతుకుతుందా డాక్టర్" అని అతడిని ఇంజక్షనివ్వకుండా ఆపగానే ప్రక్కనే వున్న నాన్నగారు "ఏరా రవీ నీకేమన్నా బుద్ధివుందా? అయినా అన్నిటికీ అడ్డం నువ్వెందుకు పైకిపోము ఆడుకో" కోప్పడ్డారు నన్నుచూసి. గదిలోవుండే అందరి ముఖాలల్లోనూ విచారం తాండవిస్తోంది. ఎవ్వరూ ఏమి మాట్లాడటంలేదు. నిశ్శబ్దం అందరిమధ్య రాజ్యంచేస్తోంది. నాకక్కడ వుండబుద్ధి కాలేదు. మేడపైకి వెళ్దామని మెట్లెక్కుతూ వున్నాను. మెట్లన్నీకూడ ఎక్కనేలేదు. ఇంతలోనే వున్నట్లుండి పెద్దగా ఏడ్చే అమ్మగొంతువిని క్రిందకు పరుగెత్తి వచ్చేను. లక్ష్మి వుండే గదిలో ప్రవేశించగానే లక్ష్మిమీదపడి "ఎంతఅన్యాయం చేసి పోయావమ్మా" అని మొత్తుకుని ఏడ్చే అమ్మ కన్పించింది.

ఒకవిధంగా లక్ష్మి ఎందుకు చనిపోయిందో నాకీనాటికి కూడా తెలియదు. కాని ఆచిన్నతనంలో కాలంతీరిపోయింది కాబట్టి లక్ష్మి ఈలోకంనుంచి వెళ్ళిపోయిందని అందరూచెప్తే నమ్మేవాడిని. లక్ష్మి నాలో మిగిల్చినప్రేమ ఆ అనుబంధం మరచి పోలేనివి ఎంతకాలంగడచినా. పెద్దయిన తర్వాతలక్ష్మి నానుండి ఎందుకు దూరం కావాలని చాలా రోజులు ఆలో చించాను. లక్ష్మిలాంటివాళ్ళు ఎందరో లక్ష్మిలాగనే వున్న

ట్నుండి మాయమయిపోతారు. వాళ్ళు బ్రతికిన వాళ్ళనెంత క్షోభ పెడతారో తలచుకున్న రోజున ఈ డాక్టరుకోర్సు చదవాలన్న పట్టుదలతోనే నేను మెడిసన్‌లో చేరాను. ఎవరి ప్రభావంవల్ల ఒక డాక్టరు అవగల్గేనో అటువంటి లక్ష్మిలాంటి మహో ఆవిడను చూడగానే మనస్సు పరవశం చెందింది. ఏదో ఆప్తురాలిని చూసినట్లు, ఆమెను కౌగిలించుకుని తృప్తిగా ఏడవాలనిపించింది ఆమెతో ఎన్నో విషయాలు చెప్పుకోవాలని పించింది. కళ్ళవెంట కారిన నీరు ఆరగానే, ముఖంలో నవ్వు తెచ్చిపెట్టుకుని మెల్లగా అడిగేను ఆమెను. "మీ పేరేమిటండీ" అని.

"సిస్టర్" .... జవాబువిని తృప్తిపడ్డాను.

అంతకుమించి ఏమీ అడగాలనిపించలేదు. మనస్సు ఏదో తెలియని బాధతో కొట్టుకుపోయింది. ఆత్మీయురాలిగా అనుకున్నంత సేపు పట్టలేదు ఆమె నా మనస్సు నొప్పించటం. చేసేదేమిలేక ఒక నిట్టూర్పువదలి "పదండి, ఆ పేషెంటుని చూసి వద్దాం" అని మాత్రం అనగల్గేను.

నేను ముందుదారి తీస్తూవుంటే నా వెనకనే ఆమె వచ్చింది ఆరోగి దగ్గరకు. తాపీగా పరీక్ష చేసిన తర్వాత మాత్రం తెలుసుకోగల్గాను ఆరోగి అపాయస్థితిలో వున్నాడని. ఏ ఆలోచనా తాత్కాలికంగా రానీయకూడదనుకున్నాను. డాక్టరుగా ఆరోగిని శాయశక్తులా కృషిచేసి బ్రతికించాలను

కున్నాను. వాడు విపరీతమయిన బాధ పడుతూంటే చూడ లేక పోయాను.

"చూడండి, ఆక్సిజన్ సిలిండరు రెడీగావుందా. వుంటే వెంటనే ఆక్సిజను పెట్టేసేయండి. పెట్టంగానే ఒక సలైన్ సెట్టు రెడీచేయండి. ఇతని బ్లడ్‌ప్రెషర్ కూడా తక్కువగా వుంది సలైన్ ఇవ్వటం మొదలుపెట్టకపోతే పేషెంటు బ్రతుకు తాడన్న ఆశకూడాలేదు". ఆమె నేను చెప్పినవన్నీ చేసిన దాకా పేషెంటు ప్రక్కనే వుండి గమనిస్తూవున్నా.

మళ్ళీ రక్తపుపోటు ఇంకోసారి రికార్డు చేసి "ఈ కేసు చాలా సీరియస్‌గావుంది. మళ్ళీ రక్తపుపోటు ఏక్షణాన తగ్గి పోతుందో మాత్రం చెప్పటం కష్టం. అతని పరిస్థితి కొంత మెరుగయ్యేవరకు నేనిక్కడే వుంటాను." చెప్పే నావైపు ఆమె అనుమానంగా చూసింది. "ఈయనెక్కడ దొరికేడు నా ఖర్మ కాకపోతే" అనుకుందేమో బహుశా.

కాని నేనదేమి పట్టనట్లు కూర్చున్నాను. నా వెనకాలే ఆమెకూడా వచ్చి అలానే నిల్చుని వుంది. అంతలో వార్డు బాయివచ్చి టీ వున్న ఫ్లాస్కు తెచ్చిఇచ్చాడు. అల్మైరాలో వున్న కప్పుల్లో రెండు నేనే తీసుకువచ్చి వాటిని టీ తో నింపాను. ఒకటినేను తీసుకొని త్రాగుతూ రెండోది ఆమె కిచ్చాను. అభ్యంతరం లేకుండా తీసుకుంది.

టీ త్రాగే ఆమెవైపు చూస్తూ అన్నాను "నిలబడే వున్నారేం. కూర్చోండి ఫరవాలేదు నేనేమీ అనుకోను లెండి.

కథా నిలయం
4746

అయినా ఎంత సేపని నిలబడతారు. అతని 'కండిషను' ఇప్పు డప్పుడే 'ఇంప్రూ' వయ్యేటట్లులేదు'. ఏమీ అనకుండా నా కెదురుగా వుండే కుర్చీలో కూర్చుంది.

టీ త్రాగి కప్పును కడగబోయేను. వెంటనే కుర్చీ లోంచి ఆమెలేచి నాచేతిలోంచి కప్పుతీసుకుని, రెండుకప్పులు కడిగి నాకెదురుగుండానే మళ్ళీ కూర్చుంది,

నేనేదో ఆలోచిస్తూవుండటం గమనించి ఆమే అంది "ఏమిటండీ ఏదో ఆలోచిస్తున్నారు" అని. ఆమెవైపు చూసాను. ప్రశాంతమైన ముఖం. ఏభావమూ కన్పించలేదు. మళ్ళీ లక్ష్మి గుర్తువచ్చింది. "మీరేమనుకోకపోతే మీకో విషయం చెప్పాలనుకుంటున్నాను. ఒకవిధంగా నాగురించే ననుకోండి. చెప్పమంటారా?" ఆమెనుండి సమాధానమేమీ రాలేదు. "సరేలెండి. అయితే చెప్పటం మానేస్తాను" అని మళ్ళీ అనగానే "ఫరవాలేదు చెప్పండి" అని మాత్రం అంది ఆమె.

"ఇందాక మీ సమాధానం విని చాలా బాధపడ్డాను. ఎందుకనో తెలుసా. ఒకడాక్టరుగా కనీసం మీరు నాకు గౌర వాన్ని చూపలేదనికాదు. కాని...కాని, ఏమోలెండి ఎందు కనోగాని చాలా బాధపడ్డాను". ఆమె ఏమీ మాట్లాడలేదు. కనీసం క్షమించమన్నట్లు కూడా లేవు ఆమెచూపులు.

"ఎందువల్ల మిమ్మల్ని మీ పేరడిగేనో మీకు తెలియకే పోవచ్చు. కాని ఒక్క విషయంమాత్రం నిజం. కొంతమందిని మొట్టమొదటి సారిగా చూడగానే ఎక్కడాలేని కోపం వస్తుంది. మరి కొంతమందిని చూస్తే ఎంతో వుత్సాహం వస్తుంది; ఆప్తుల్ని చూసినట్లే ఫీలవుతాము. అవునంటారా?"

"డాక్టర్లుమీకు. ఏవిషయాన్ని కాదాలనిపించినా చెప్పాలంటేమాత్రం నోరు రాదు. కాని ఈ విషయంలో మాత్రం మీతో ఏకీభవిస్తాను."

"మిమ్మల్ని చూడగానే ఏమనిపించిందో చెప్పనా. నాలక్ష్మినే తిరిగి చూస్తున్నానా అనిపించింది". ఆమెతనలో తను చిరునవ్వునవ్వుతూ "లక్ష్మంటే మీ మిసెస్ కాబోలు" విచిత్రంగా ఆమెవైపు చూసాను. ప్రపంచంలో ఎవరైనా ఓ ఆడదానిగురించిచెప్తే ఏమంటారో ఆమె అలానే అన్నట్లనిపించింది.

"సారీ నాకింకా పెళ్ళికాలేదు. నాలక్ష్మంటే నాఅర్థం మాత్రం నాచెల్లెలు లక్ష్మనే సుమండీ" నేనుకూడా చిన్నగా నవ్వాను. ఎందుకనో ఆమె ముఖంలో వింతమార్పు గమనించాను.

"క్షమించండి డాక్టర్. ఇంతవరకు మీ మనస్సు నొప్పించాలన్నదే నా అభిమతం. అందుకనే నాఇష్టంవచ్చి

నట్లు సమాధానాలిస్తూవచ్చాను. కాని ఏమీ భయంలేకుండా మీముందు చెప్పాలంటే నాకు డాక్టర్లంటే మహామంట. అసహ్యం కూడాను. కారణంమాత్రం మీకు చెప్పననుకోండి, దాన్ని తెలుసుకోవటంవల్ల వచ్చే ప్రయోజనం కూడాఏమీ వుండదనుకోండి. అందుకనే మీరంటేకూడా ముందు ముభావంగానే వున్నాను. ఏది ఎలావున్నా ఇప్పుడలాంటి భావమేమి లేదనుకోండి."

తననుకున్న దేమిటో ఏమీ దాచకుండా చెప్పే ఆమెంటే అదొక రకమైన ఇష్టం ఏర్పడిందినాకు.

"కాని డాక్టర్లంటే మీ అభిప్రాయంకూడా తప్పే. డాక్టర్లమీద మీరంతటి ఏహ్యభావాన్ని ఏర్పరచుకోటానికి కారణమేమిటో వూహించుకోగలను. కాని ఎవడో చెడ్డవాడని అంతా చెడ్డవాళ్ళనుకోవటం మాత్రం ఒప్పుకోను నేను. ప్రతివిషయంలోనూ మంచి చెడూ అనేవి తప్పకుండా వుంటాయి. ఆలెక్కన స్త్రీజాతినే అసహ్యించుకోవాల్సింది నేను. జీవితంలో మోసపోయినా, అదీ వాళ్ళవల్లనే అయినా ఆడవాళ్ళంటే ఇప్పటికీ నాకు గౌరవమే. బహుశా నేనెలా మోసపోయానా అనేది చెప్పమంటారా?"

ఏ సమాధానం రాలేదామె దగ్గరనుంచి.

"చూడండి. నేనెప్పుడూ ఎవరితో నా విషయాలు అందులో నాస్వంత విషయాలు చెప్పుకోను. కాని ఈనా

ఏందుకో మీకన్ని విషయాలు చెప్పేయాలనిపిస్తూ వుంది. నాలోనే ఇన్నాళ్ళు దాచుకున్నానేమో, ఆ విచారానికి నామనస్సు కృంగి కృశించి పోతుందేమోననిపిస్తూవుంటుంది. ఈనాడు కనీసం మీకయినా చెప్పుకుంటే మనస్సు తేలిక పడుతుందేమో, నేను మొదలు పెటేముందు మళ్ళీ మీపేరే అడిగేననుకోండీ చెప్పటానికి అభ్యంతరం వుండదుకదూ?" అడిగేను మళ్ళీ.

"కమల" అనిమాత్రం అనేసి వూరుకుందామె.

"చూడు కమలా....అవును అలానే పిలుస్తా ఇంకెక్కడ మిమ్మల్ని చూడటం తటస్థించినా; ఈకోర్సు ఎవరికోసం చదివేనో తెలుసా? చేరేముందు లక్ష్మికోసం. చేరినతర్వాత పద్మకోసం. నా ఆలోచనల్లో ప్రతిక్షణం వీళ్ళిద్దరే. నాజీవితంలో వీళ్ళ పరిచయం చెరగని ముద్రగా మిగిలిపోయింది. వాళ్ళంటే ఎంతటి అనుబంధం పెంచుకున్నానో మాటల్లోమాత్రం చెప్పలేనునేను. చిన్నప్పుడు లక్ష్మిని నిమిషంసేపుకూడా విడవకుండా అంటిపెట్టుకుని తిరిగేవాడిని. లక్ష్మి నాతోనేఎప్పుడూ వుంటుందని నేనాశించక పోయినా తీరని అన్యాయమే చేసిపోయింది. లక్ష్మిలాంటి వాళ్ళెందరినో బ్రతికించాలని మెడిసన్‌లో చేరాను. ఒకవిధంగా లక్ష్మి తెలియకుండానే నాకన్యాయం చేసిపోయింది. చేరిన రెండుమూడేళ్ళు లక్ష్మికోసం చదివేను. ప్రతిరోజు కాలేజికి వెళ్ళేముందు లక్ష్మిని ఒకసారి తలచుకున్నతర్వాతనే బయలుదేరేవాడిని. పద్మతో పరిచయ

మయిన తర్వాత మాత్రం లక్ష్మికి నేనంత ప్రాముఖ్యత ఇవ్వ లేకపోయాను. చివరి మూడేళ్ళు పద్మకోసమే మెడిసన్ చదువు తున్నానని అనుకున్నాను...కనీసం అలా అనుకునేటట్లుగా నమ్మించింది పద్మ. చివరివరకు నమ్మించి, చివరిలో ఆనమ్మకం మీదనే నన్ను మోసంచేసినా నేనామంటే ఏనాడు అస హ్యించుకోలేదు..... అసహ్యించుకోను కూడా....'' మధ్యలో ఆపవలసి వచ్చింది కమలేదో అడగబోతూవుంటే.

"పద్మ మీ మరో చెల్లెలా" అమాయకంగా అడిగింది కమల.

వచ్చిన నవ్వును ఆపుకోలేకపోయాను. ''కాదుకమలా అసలు పద్మనాకేంకాదు. నాకు కావలిసినవాళ్ళుగా అను కున్నరోజున పద్మే నాసర్వస్వం అని నమ్మేను. అలానేపద్మను అభిమానించాను. ఈ జీవితానికి ఆమే తోడని నమ్మేను. పెళ్ళి చేసుకున్నట్లే మురిసిపోయాను. ఇంకా పద్మగురించి ఏమేమో చెప్పాలనివుంది. సినిమాల్లోలా చెప్పాలంటే పద్మని మనస్ఫూర్తిగా ప్రేమించాను".

"ఇప్పుడుమాత్ర మేమయింది. అంత ముంచుకు పోయింది మాత్రమేముంది, అనుకుంటే పెళ్ళిజరగకపోతుందా ఏమిటి?" మధ్యలో అడిగింది కమల.

''చూడుకమలా, ఆ 'సలైన్' అయిపోవచ్చింది. మరింకో సీసా తగిలించి వస్తారా?'' కమల తిరిగి నాదగ్గర

కొచ్చేటప్పటికి ఏమేమి చెప్పాలా, ఎలాచెప్పాలనేది ఆలో చిస్తూ కాలాన్ని గడిపివేసాను.

"కమలా, నాదో చిన్నకోరిక అడగమంటారా?" అడగమన్నట్లు చూసింది. "అన్నయ్యలెంతమంది మీకు".

"అంత అదృష్టం ఈజన్మకు నాకులేదనే చెప్పాలి".

"అలా అయితే నన్ను ఈక్షణంనుంచి 'అన్నయ్యా' అని అనగల్గుతావా?.... సారీ ఏకవచన ప్రయోగం చేసినందుకు కోపం లేదుకదూ? అయినా చెల్లిని 'మీరు' అంటే మనిద్దరి మధ్యా దూరం ఎక్కువవుతుందే తప్ప వచ్చేదేమీ లేదు. అందుకనే ఇకమీదట 'నిన్న' ని మాత్రం అంటానిన్ను. నన్నయినా డాక్టరనవలసిన పనేలేదునీకు. "అన్నయ్యా" అంటే ఎంతో సంతోషిస్తాను...." కమల కళ్ళలో నీరుతిరగ టం స్పష్టంగా కన్పించింది.

"జీవితంలో నేనేమి పోగొట్టుకున్నానో నాకోనాడు తెలియలేదు. తెలిసేటప్పటికి మిగిలిందేమిలేదని తెలుసు కున్నాను, జీవచ్ఛవంలా బ్రతకటానికి మిగిలిన ఈశరీరంతప్ప. పోయిన దాన్నంతా తిరిగి పొందాలన్న కోరికకూడ నాకు లేదిప్పుడు. కాని లక్ష్మి స్థానంలో నిన్నునిలబెట్టుకుంటే మన స్సుకు కొంతయినా శాంతి దొరుకుతుందేమో. ఇంతకు ముందే నీతో అన్నట్లు నీకన్ని విషయాలు చెప్పేస్తాను. చెప్పినదంతా విని నువ్వయినా నన్నర్థంచేసుకుంటే అన్నయ్యగా

చివరకు నీకయినా మిగులుతానన్న నమ్మకం కల్గుతోంది నాకు". సిగరెట్టు ముట్టించటానికి మాట్లాడటం కొంచెంసేపు ఆపేను.

"మాది ఈవూరికి దగ్గరలోనే ఒక పల్లెటూరు. పేరంటావాఎందుకులే ఆవూరిపేరు, అదెక్కడుందోకూడా చాలా మందికి తెలియదు. వంశ పారంపర్యంగా శ్రీమంతులనబడే వాళ్ళ ఇంట్లోనే పుట్టాను. నాతర్వాత చాలా సంవత్సరాలకు గాని లక్ష్మి పుట్టలేదు. అందుకనే లక్ష్మంటే ఇంట్లో అందరికీ కూడ గారాబం. నేనయినా చిన్ననాటినుంచి అందరితోనూ ఎక్కువ తిరిగే వాడిని కాదు. ఆకారణంచేతనే లక్ష్మి అన్నీ అయింది నాకు. లక్ష్మిని క్షణం వదలిపెడితే నాకేమి తోచేది కాదు. లక్ష్మి ఏకారణం వల్లనయినా బాధపడితే నాకళ్ళ వెంట నీరుకారేది. లక్ష్మి ఈలోకాన్ని విడిచిపోయినా, ఎన్నో సంవత్సరాలు గడిచినా నాఒంటరితనం మాత్రం నన్ను విడిచి పోలేదు. మెడిసన్‌లో చేరినాగాని ఎవ్వరితో ఎక్కువ తిరిగేవాడిని కాదు. ఎవరిగురించి ఏమీ పట్టించుకోపోవటం, క్లాసులో మంచి మార్కులు తెచ్చుకోవటంవల్ల నేను మంచి వాడినన్న పేరుండేది. చాలామంది నాకు దగ్గరవ్వాలని చూసే వారు. వాళ్ళెంత దగ్గరవాలనుకుంటే నేనంత దూరమయే వాడిని.

నేను ఫోర్తియరులో ప్రవేశించిన రోజులవి. ఒకరోజు ఒంటరిగానే సినిమాకు వెళ్లాను. కొంచెం ఆలస్యంగా వెళ్ళటం

అందులోనూ కొత్త సినిమా కావటంవల్ల కూర్చోటానికి స్థలమెక్కడా కన్పించలేదు. దూరంగా నన్నేగమనిస్తూన్న పద్మని చూసాను. తనప్రక్కన సీటు కాళీగా వుంటే వచ్చి కూర్చోమన్నట్లుగా సైగచేసింది. ఇష్టం అంతగా లేకపోయినా చేసేదేమిలేక వెళ్ళికూర్చున్నాను. పద్మ క్లాసుమేటుగా తెలుసు నాకు. కాని అంతవరకెప్పుడూ మాట్లాడి ఎరగను. కూర్చోబోయేముందు కృతజ్ఞతా పూర్వకంగా చిరునవ్వునవ్వాను.

ఆపరిచయం తర్వాత అప్పుడప్పుడూ మాట్లాడుతూ వుండేవాడిని. ఒకరోజు పద్మే నన్నువాళ్ళ హాస్టలికి రమ్మని ఆహ్వానించింది. ఇష్టంగానే వెళ్ళాను. మాటల్లో చీకటిపడటం కూడా ఇద్దరం గమనించనేలేదు. వాచ్‌మేన్ గేటు మూయటానికి వచ్చినపుడు మాత్రం వెళ్తానంటూ లేచాను. ఆమె వైపు వెళ్ళబోతూ ఓసారిచూసాను. నేను వెళ్ళటం ఎంత మాత్రం ఇష్టంలేదన్నట్లున్నాయి ఆమె చూపులు. కాని చేసేదేముంది. ఎలాగయినా నేనక్కడినుంచి కదలటం తప్ప లేదు.

"ఇవ్వాళెంతో ఆనందంగా గడచిపోయింది. ప్రతిక్షణం ఇంత అందంగా, ప్రతిరోజూ ఇంత వుల్లాసంగానూ వెళ్ళిపోతే ఎంత బాగుంటుందండీ రెండుగంటలూ రెండుక్షణాల్లా గడచిపోయాయి. అప్పుడప్పుడూ వస్తూవుండండి మర్చిపోరు కదూ?" స్కూటర్ బరువుగా సాగిపోతుంటే విన్పించాయి గాలిలో ఆమె మాటలు.

ఏదో ఆ పుట్టలు దూరమవుతున్నట్లనిపించింది నాకు ఆ క్షణాలో. ఆరోజునుంచి తరచుగా వాళ్ళ హాస్టలికి వెళ్తూ వుండేవాడిని. కాలం గడుస్తున్నకొద్దీ పద్మని చూడకుండా బ్రతక గలనా అనేస్థితికి వచ్చేసాను.

మేం ఏమేమి మాట్లాడుకునేవాళ్ళమో ఈనాడునాకు బాగా గుర్తుండకపోవచ్చు. కాని ఇద్దరిమధ్య పెరిగిన అనుబంధం ౹ తెంచరానిదని మాత్రం ఎప్పుడూ మర్చిపోలేను.

ఒకనాడు పద్మే అన్నది. "రవీ, ఈ అనుబంధంశాశ్వతమయిపోవాలని మీకుండదూ?" సమాధానం వెంటనే చెప్పలేక పోయాను. మళ్ళీ అడిగింది పద్మ నేనేమి అంటానో వినాలని." చివరకు అదంతా సులభమా పద్మా. ఈనాడు ఈ వేడిలో, వుద్రేకంలో అలా అనవచ్చు. మన అనుబంధం శాశ్వతంగా వుండాలంటే ఇద్దరికీ దృఢమైననిశ్చయంవుండాలి. అటువంటి నిశ్చయం నీకున్నరోజున ఈ అనుబంధం ఇలానే జన్మజన్మలకీ వుంటుందని నానమ్మకం" అన్నానునేను.

"అంటే నామీద నమ్మకం లేదారవీ" పద్మ అడగగానే ఏంచెప్పాలో తోచలేదు. ఆలోచించి మాత్రంఅన్నాను "నీమీద నమ్మకం నీకుంటేచాలు పద్మా. నానమ్మకాలతో నీకు పనేమిటి. మనపెళ్ళి జరుగుతుందన్న నమ్మకం నీలోనాలో వున్నంతవరకు సాధ్యం కానిదంటూ వుందని నేననుకోను."

పైకి అలా అన్నానేకాని పద్మకాదన్నా ఆమెను వదలుకునే స్థితిని ఏనాడో దాటిపోయాను. కలలోకూడా

పద్మ కన్పించకపోతే బ్రతకలేనిపరిస్థితి అది. ఆవేసవిలోనే ఈ విషయాన్ని పెద్దవాళ్ళకుచెప్పి వాళ్ళఅనుమతి పొందాలని అనుకున్నాం.

కాని ఎలాచెప్పాలో తెలియటంలేదు.... ఒకరోజు... అవును ఒకరోజు ఆరోజుని నేనెప్పటికీ మరచిపోలేను కమలా.

పద్మ మెల్లగా నాదగ్గరకువచ్చి నిల్చుంది. ముఖంలో ఏమాత్రం సంతోషంలేదు. ఏదో చెప్పాలని ప్రయత్నిస్తోంది. నోటివెంట మాటమాత్రం పెగిలిరావటంలేదు. చెక్కిలిమీద కన్నీటిధార కన్పించింది. ఏమయిందనికూడా అడగలేక పోయాను.

“రవీ నన్ను మర్చిపోగలవా?” నాచెవులు నేనే నమ్మ లేకపోయాను. నానోటివెంట ఇంక మాటరాలేదు....

సిగరెట్టు పూర్తిగా కాలిపోయింది. ముక్కనుదూరంగా విసిరిపారవేశాను. కమల నన్నే రెప్పలార్పకుండా చూస్తూ వుంది.

పెద్దగా ఏడుస్తూ మావార్డువైపే వచ్చే ఓ ముసలమ్మ వైపే నాదృష్టిమరల్చాను. రావటంతోనే డాక్టరుగా నన్ను పోల్చుకున్నట్లుంది. చెయ్యెత్తి నమస్కరించింది. “నా కొడు క్కెలా వుందిబాబూ. ఏం చేస్తారోబాబూ మీరు వాడిని. వాడొక్కడేనాయనా నాకు” ఏడుస్తూనే గొణిగింది. అర్థంగాని నాకు కమలే శరణ్యమయింది. “మీరటండయ్యో” కేసే

అన్నయ్యా. రాత్రనక పగలనక ఈ వార్డులోనే వుంటుంది పాపం. ఇంతకుక్రితమే ఎక్కడికో వెళ్ళింది ఇప్పుడే వస్తుం దనుకుంటాను.''

ఆరోగి దగ్గరకు వెళ్ళి చూసాను. శ్వాస పీల్చటానికి చాలా కష్టపడుతున్నాడు. రక్తపుపోటు చూసాను. తగ్గు తున్నట్లుంది.

''కమలా ఇతనికి ఆపరేషను అవసరం వచ్చేటట్లుంది. థియేటరు రెడీగా వుంచమని ఫోను చేస్తావా? అయినా ఇం కొంచెంసేపు వేచిచూద్దాం. అతని పరిస్థితి మెరుగవుతుం దేమో'' అన్నాను.

''ఏం ఫరవాలేదమ్మా. సీరియస్‌గానే వుందనుకో. భయపడవలసిన పనేమిలేదు. నేనిక్కడే వున్నాగా. చేయ గలిగినదంతా చేస్తాను. మీరుపోయి బయటకూర్చోండి. అవ సరమైనప్పుడు లోపలికి పిలుస్తాను''. అక్కడనుంచి వార్డు బయట కూర్చోటానికి ఆమెను పంపేటప్పటికి నాతలప్రాణం తోకకొచ్చింది.

కుర్చీలో కూర్చున్నాను. ఆరోగి బాధపడుతూనే వున్నాడు. అంతకు తప్పించి వార్డంతా నిశ్శబ్దంగానే వుంది. సిగరెట్ ముట్టించి మళ్ళీచెప్పటం ప్రారంభించాను.

''పద్మని ఎందుకని ఏమీ అడగలేకపోయాను. ఎందు వల్లనో మాత్రం నాకు తెలియదు. 'నన్ను క్షమించురవీ.

ఆశలు కల్గించాను. అవితీరకముందే ఈనాడు తెలుసుకున్నాను, మనలాంటి వాళ్ళకి సంఘంలో తావులేదని కులం కట్టిన అడ్డుగోడల్ని దాటలేక కాదు; కాని మన పెళ్ళయినా కనీసం ఆత్మతృప్తయినా మిగులుతుందన్న నమ్మకం నాకులేదు. ఇదే ఆకరుసారిగా మిమ్మల్ని కలుసుకోవటం అవుతుందేమో, మీరుకూడా నన్నెప్పుడూ కలవాలని ప్రయత్నించకండి, నావైపే చూస్తూ అడుగులు వేసే పద్మని ఏమీ అడగలేకపోయాను. పద్మ ఎందువల్ల అలా అన్నదో నాకీనాటికి తెలియదు. నన్నెందుకు వదులుకున్నదో; అంతటి త్యాగానికేం అవసరంవచ్చిందో కూడా తెలియదు. తెలుసుకోవాల్సిన అవసరంకూడా నాకు కన్పించలేదు. నేనంటే ప్రాణంవిడిచిన పద్మే నాకు కాకుండా పోయినప్పుడు, ఏపరిస్థితుల ప్రభావం ఆమెలామారటానికి సహాయపడ్డదో తెలుసుకోవాలా నేను. ఏమంటావు కమలా? నేనెన్ని రోజులు బాధపడ్డానో, ఎన్నిరోజులు తిండితినలేదో, ఎన్నిరాత్రుళ్ళు నాకు నిద్ర కరువయిందో, ఏదోపోగొట్టుకున్న వాడిలా ఎంత తిరిగేనో నాకింకా బాగా జ్ఞాపకం.

తినటానికి తిండివుంది. అనుభవించటానికి డబ్బువుంది. ఈరెండింటినీ సమకూర్చి పెట్టటానికి నామీద ఆధారపడి జీవించే వాళ్ళులేరు. అటువంటప్పుడు నేనెవ్వరికోసం బ్రతకాలి, ఏమి చూసుకుని బ్రతకాలో అర్థంకాలేదు. ఎన్నోసార్లు చచ్చిపోదామని ప్రయత్నించాను. కాని నాకదికూడా చేతకాలేదు.

ఇంతజరిగి, కాలం గడుస్తున్నకొద్దీ పద్మను మరచిపోలేక పోయినా మనస్సులోని దిగులుమాత్రం పోగొట్టకోగల్గాను. అందువల్లనే ఎందుకోసమో ఎవరికోసమో బ్రతకాలనిపించింది. ఎక్కడో ఎప్పుడో చదివినట్లు జ్ఞాపకం బ్రతకటానికి మనకు హక్కువుంది కాని చావటానికిమాత్రంకాదు.

ఆతరువాత నేనెప్పుడూ పద్మని చూడనేలేదు. పద్మ ఏమయిందో కూడా తెలియదు. నేను పద్మతోబాగావుండే రోజుల్లో పగటికలలు కనేవాడిని. ఏమనో తెలుసా జీవితంలో సగభాగం ఒంటరిగానే గడిపివేసాను. పద్మతో పెళ్ళవగానే నారక్తాన్ని పంచుకొని ఒకడు పుట్టకపోడుగా, వాడితో ఆడుకుంటూ, ముచ్చట్లుచెప్పుకుంటూ ఈజీవితాన్ని ఏ చీకూ చింతా లేకుండా గడిపి వెయ్యాలి. కాని కలలన్నీ కల్లలయాయని తెలిసిన తర్వాత ఒకోసారి పద్మమీద కోపంవచ్చేది. పద్మ నన్ను మోసంచేసి పారిపోయిందని అనుకునేవాడిని. కాని వెంటనే పరిస్థితుల ప్రభావమని నాకైనేను సర్దిచెప్పుకునే వాడిని. పద్మని తిట్టుకునేటప్పుడు స్త్రీజాతి మొత్తాన్నిదుమ్మెత్తి పోసేవాడిని. కాని పద్మలాంటి వాళ్ళరుదుగా వుంటారని, అలాంటప్పుడందరినీ దూషించటం మంచిదికాదని అనుకునే వాడిని మరుక్షణంలో.

తర్వాత రోజుల్లో నన్ను పెళ్ళిచేసుకోమని ఎందరో బ్రతిమి లాడేరు. నాన్నకూడా బలవంతపెట్టారు, బెదిరించారు. చివ

రకు ఆదిగులుతోనే మంచంపట్టి చనిపోయారు. కాని నేను మాత్రం మారలేదు, మారనుకూడా ఆమెమారితేఏం, ఎం దుకుపెళ్ళి చేసుకోకూడదూ అనిఅడిగేవాళ్ళంతా. అంతకన్న అందమయినవాళ్ళు అంతకుమించి ప్రేమించేవాళ్ళు దొరుకు తారని కూడానాకుతెలుసు. నాజీవితాన్ని ప్రేమకోసం త్యాగం చేయాలనికాదూ, నాప్రేమకు మించిందేమీలేదని కాదు నేను పెళ్ళిమానేసింది. ఈవిషయంలోనే నన్నెవరూ అర్థంచేసుకోలేదు. నువ్వు అంతేనాకమలా ? జీవితంలో మరె వ్వరినయినా ప్రేమించగలనేమోగాని పద్మని ప్రేమించినంత ప్రేమించలేను కమలా. బహుశా అందుకు నామనస్సు వప్పు కోదు కమలా. అంతగా ప్రేమించలేనప్పుడు నేను ఇంకొకరిని పెళ్ళి చేసుకోవటం మహాపరాధమని నావూహ.

అయినా పద్మను నేనెంతో పవిత్రంగా ప్రేమించాను. నిజంగా ఆమెనన్ను ప్రేమించిందో లేదోకూడా చెప్పలేను నేను. నన్నువదలిపోయేముందయినా కనీసం నేనొక్కమాట కూడా చెప్పలేకపోయాను, బహుశా దానికి కారణమొక్కటే. బ్రతిమిలాడి, బెదిరించి నిలబెట్టే ప్రేమ ఎక్కువకాలంవుండదు. ఆమె ఆశల్ని కల్పించింది, అనుబంధాల్ని సృష్టించింది, చివ రకు ఆమే వాటిని త్రెంపుకుని కూడా పోయింది. ఆశలుతీరక పోయినా, ఆమె నా జీవితంనుంచి నిష్క్రమించినా, పద్మను తిట్టుకునే అధికారం నాకులేదు. నిజమైన ప్రేమ త్యాగాన్ని కోరుతుంది. ఆమెక్కడున్నా, ఏంచేస్తున్నా కనీసం ఆమె

యినా సుఖంగావుంటే నాకుచాలు. అయినా కమలా నా జీవితంలో మేఘాలు ఎప్పుడూ దట్టంగా అలుముకుంటూనే వుంటాయి. అవి వర్షిస్తాయని ఎదురు తెన్నులు చూడటం తోనే సరిపోయింది. కాని అదేమి అదృష్టమో అవెప్పుడూ వర్షించవు..." వార్డులోని ఫోను మ్రోగింది. కమల రిసీవరు ఎత్తింది. మీ కేనంటూ నాకేఇచ్చింది. క్యాజుయాలిటీనుంచి ఫోను వచ్చింది, ఏదో యాక్సిడెంటు కేసొకటి వచ్చిందట. చాలా సీరియస్‌గావుంది వచ్చిఒకసారి చూసి ఏంచెయ్యాలో చెప్పిపొమ్మని.

వార్డులోని రోగిని చూడటానికి వెళ్లాను. క్షణక్షణా నికి పరిస్థితి మరీ అధ్వాన్నమవుతున్నట్లనిపించింది. "కమలా, ఈ కేసుని వెంటనే థియేటరుకు 'షిఫ్టు' చేయండి. క్యాజు యాలిటీకివెళ్ళి తిన్నగా ఆపరేషను థియేటరుకు వచ్చేస్తాను" స్టెత్ తీసుకుని వార్డుబయటికి వచ్చానోలేదో ఆముసలమ్మ కన్పించింది.

"చూడమ్మా, కేసుచాలా సీరియస్‌గావుంది. ఆప రేషను చెయ్యాల్సి వస్తుంది. ఇంకో అర్జెంటు కేసువుంటే చూడటానికి వెళ్తున్నాను. దాన్నికూడాచూసి ఇప్పుడే వస్తాను. రాంగానే ఆపరేషను మొదలుపెడతాను ఏమీ భయపడకు...." ఆమె ఏమీ అడగకుండా నేనే అంతాచెప్పే సాను.

“అలా వీల్లేదుబాబు. మీరెక్కడికి పోకండి. దయుంచి వాడిని కాపాడండి, వాడినెలాగయినా బ్రతికించండి. వాడొక్కడేబాబూ నాకు. వాడికేంజరిగినా బ్రతికుండి నేనుచూడ లేను డాక్టరుబాబూ. ఈవయస్సులో నన్నేడిపించకండి నాయనా” బ్రతిమిలాడటం మొదలెట్టింది ఆమె.

“చూడుతల్లీ. ప్రాణమనేది అందరికీ సమానమేకదూ? అందుకనే ఇప్పుడే వచ్చేస్తాగా. మీవాడికొచ్చిన భయమేమీ లేదు. వాడిని కాపాడటం నావిధి. వాడు మళ్ళీలేచి తిరిగేటట్లు చేస్తాగా” ఏమోబాబూ మీదయని చేతులెత్తి నమస్కరించి నావైపే చూస్తూనిల్చున్న ఆమెవైపు చూడకుండా గబగబ క్యాజువాలిటికి నడక సాగించేను.

క్యాజువాలిటీలోకి ప్రవేశించి చూసాను; చాలా రద్దీగావుంది. అర్ధరాత్రయినా అంతమందిని చూడటం నాకదే మొదటిసారి. కాని వాళ్ళంతా ఆ యాక్సిడెంటు కేసును చూట్టానికి వచ్చినవాళ్ళని తెలియటానికి ఎక్కువసేపు పట్టలేదు. అందర్నీ బయటికివెళ్ళి కూర్చోమనిచెప్పి ఆపేషెంటు దగ్గరకెళ్ళబోయాను.

ఆరోగి ప్రక్కనే నిల్చుని కళ్ళొత్తుకునే ఆమెను చూసాను. అంతవరకామెను గమనించనేలేదు. నెత్తిమీద ఎవరో సుత్తితో కొట్టినట్లయింది. గుండె వేగంతో కొట్టుకోసాగింది. నుదుట చిరుచెమట పోయటం ప్రారంభించింది. చేతులు వణికేయి. నాలుకమీద తడారి పోయింది.

సందేహంలేదు.... ఎవరినయితే ఇంకెన్నడూ చూడలేనని అనుకున్నానో, ఆమే.... అవును. ఆ పద్మే, ఇన్ని సంవత్సరాలు గతించినా ఏ మార్పును చూడలేకపోయాయి నాకళ్ళు. ఆనాడెలావుందో ఈనాడూ అలానేవుంది. ఈ క్షణంలో మాత్రం మనిషిలో ఏదోనిండుతనం కన్పిస్తూవుంది. నిలువుబొట్టు సూర్యబింబాలాంటి గుండ్రటి ఎర్రబొట్టుగా మాత్రం మారింది. మేలిముసుగు వేసుకున్న పద్మను పోల్చుకోవటం ఏమంత కష్టం వేయలేదు. పద్మ మాత్రం నన్ను చూడలేదు. దెబ్బలుతినివున్న ఆయనవైపు తదేకంగాచూస్తూ నిలబడివుంది. అతను పడుకున్నవైపుగా మెల్లగా అడుగులు వేశాను.

ఎండిపోయిన నాలుకను తడిచేసుకుంటూ అడిగేను. నూతిలోనుంచి వచ్చిన శబ్దాలా అస్పష్టంగా వున్నాయి నా మాటలు. "పద్మా, ఈ అర్ధరాత్రివేళ ఇలావచ్చేవేం? ఒంటరిగా."

పద్మ త్రుళ్ళిపడి నావైపు చూసింది. ఆమెకూ కూడా నోటివెంట మాటరాలేదు. చివరికెలాగైతే పట్టిపట్టి మాట్లాడింది. "ఒంటరిగా మాత్రం రాలేదు - ఇలా వస్తాననికూడా - నేనెప్పుడూ అనుకోలేదు. పరిస్థితులకెప్పుడూ మనం బానిసలమే. లేకపోతే మిమ్మల్నిలా కలవవలసివస్తుందని నేను కలలోకూడా వూహించలేదు. మిమ్మల్ని కలవటం మాటలా

వుంచి, మేమంతా పిక్నిక్ కు సరదాగా వెళ్ళటం ఏమిటి, వచ్చే దారిలో ఈ యాక్సిడెంటేమిటి? అంతా ఖర్మగదూ!"

"ఎవరాయన?"

"మావారు. పెళ్ళిజరిగి ఆర్నెల్లయినా నిండలేదు. నేను వద్దన్నా వినకుండా బయల్దేరమన్నారు. ఆయన బాధ పడతారని ఇష్టంలేకపోయినా బయల్దేరాను. కాని ఇంతలోనే ఇలా అవుతుందని నేననుకోలేదు డాక్టర్...."

గుండెలో ఎవరో కత్తితో పొడిచినట్లయింది. ఆయన పద్మ భర్తని వినలేకపోయాను. అలా అనుకొని కనీసం చూట్టానికయినా ధైర్యంలేదు నాకు. తనవారుగా నమ్మిన వాళ్లు ఇంకొకరి సొమ్మయినప్పుడు చూడలేరు. తనవాళ్లెవరినీ ఇతరులకు పంచలేరు, పంచబడటంకూడా చూడలేరు. అందుకనే అక్కడ నిల్చునివుండటం ముళ్ళమీద వున్నట్లుంది. కాని చేయగల్గిందేమీలేదు. నుదుటి చెమట తుడుచుకొని ఆ పేషెంటువైపు వెళ్లాను.

"ఐ యామ్ సారీ టు డిస్టర్బ్ యు సార్. బ్లడ్ ప్రెషర్ ఏంచేసినా పెరగటంలేదండి. ఇంతవరకు అతను కోలుకోలేదు. చాలా రక్తం పోయిందని వాళ్ళవాళ్ళంతా చెప్తున్నారు. మీ సలహాకోసం మీ రూంకు ఫోనుచేసాం. మీరు వార్డులో వున్నారని తెలిసి అక్కడికికూడా ఫోను చేసాం. మాకేం చెయ్యాలో అర్థంకావటంలేదు; ఏం చేయమంటారు?"

అక్కడవుండే హౌస్‌సర్జను నా ముఖంలోకేచూస్తూ అడిగాడు. నాదగ్గరనుంచి సమాధానం ఏమీ రాకపోయినా నన్నే ఇంకా చూస్తున్నాడు.

కొంచెం ప్రక్కకు రమ్మన్నట్లుగా పద్మ సైగచేసి పిలిచింది.

"మిమ్మల్ని ప్రార్థించే హక్కు కూడా లేదు నాకు. ఏనాడో మీకు దూరమైపోయ్యాను. ఈరోజు నాకు సహాయం చేయమని అడగాలంటే స్వార్థమేఅవుతుంది. రవిగా మిమ్మల్ని ప్రార్థించటంలేదు; ఒక డాక్టరుగా మిమ్మల్ని వేడుకొంటున్నాను. ఆయన్ని ఎలాగైనా బ్రతికించండి. ఆయనలేని జీవితం నాకు వద్దు. నేను బ్రతికిమాత్రం ఎవరిని వుద్ధరిస్తాను. ఆయన్నెలాగయినా కాపాడేరంటే జన్మజన్మలకీ కృతజ్ఞురాలుగా వుంటాను." కళ్ళవెంట కారే కన్నీటినయినా కనీసం తుడుచుకోకుండా రెండుచేతులు జోడించి నమస్కరించే పద్మను అలానే చూసాను.

పద్మంటే అసహ్యం వేసింది. స్వార్థంతో కరుడుగట్టిన ఆమె హృదయం కోసం ఒకనాడు నేను పరితపించిపోయింది? ఎందుకనో వార్డులోని ముసలమ్మ గుర్తువచ్చింది. ఆమెకు ఈమెకు తేడా ఏమిటో నాకర్థంకాలేదు. వారితో జీవితం ముడివేసుకుపోయిన వ్యక్తుల్ని ఎలాగయినా నేనురక్షించాలి. వాళ్లానందంగా వుండేటట్లు చూడాలి.

నిలువునా నా జీవితాన్ని నాశనంచేసి పోతున్న ప్పుడు నా జీవితం ఎలా నడుస్తుందో కనీసం నేనేమైపోతానో అక్కరలేని పద్మకు నేను సాయంచెయ్యాలి. అవును, అదే న్యాయం; అవును వాళ్ళే మనుష్యులు; అవును వాళ్ళే సుఖం చాలి; అవును వాళ్ళే జీవించాలి.

బుర్ర పనిచేయటంలేదు. గుండెలో ఇంకా ఏదో బరువుగానే వుంది. పద్మకు నన్నుచూచిన విస్మయానికంటే ఆయన కేం అవుతుందోనన్న ఆతృత మాత్రమే వున్నట్లని పించింది.

"నేనంటూ జీవించివుంది డాక్టరుగా నావృత్తి ధర్మా న్నయినా కనీసం నిర్వర్తించగలనేమోనన్న నమ్మకంతోటే. జరగబోయేదానికి జరిగినది నాంది మాత్రంకాదు. నాచేతుల్లో అంతా లేదు. అయినా మీరుకూడా డాక్టరు. మీకు నేను చెప్పే దేముంది".

"మీరలా పిలుస్తుంటే మిమ్మల్ని నేను మోసంచేసి నట్లవుతుం దేమోననిపిస్తూవుంది డాక్టర్. మీఊహ తప్పని మాత్రం చెప్తేకూడా సరిపోకపోతే నేను డాక్టరు కోర్సు మధ్యలోనే ఆపేసానని చెప్పటం అవసరమవుతుంది. కాని దానికీనాడు నిజంగా పశ్చాత్తాపపడుతున్నాను. నేనుకూడా ఒకడాక్టర్నయివుంటే ఇలాంటి ఆపదసమయంలో ఆయన్ను దక్కించుకునే దానిని డాక్టర్. ఈరోజున నిజంగా నాచదువు

సార్థకం అయివుండేది.'' అయితే పద్మ చదువుమానేసిందా.... కారణం ... ఏమో. 'పల్స్' చూస్తూ పాతరోజులు గుర్తుకు తెచ్చుకుంటున్నాను. పద్మలో మార్పేమీ లేదు. కానివచ్చిన మార్పంతా ఒక్కటే. ఆరోజుల్లో ప్రతిక్షణం నాగురించే ఆలోచించేది. ఈక్షణంమాత్రం ఆమె ఆలోచనలన్నీ ఆమెభర్త గురించిమాత్రం.

"ఏం పద్మా, అయితే నామీద నమ్మకం లేదా మీకు. మీ దృష్టిలో నేను అసమర్థుడినికదూ? లేకపోతే పాత సంగతుల్ని పట్టించుకొని పగతీర్చుకోవాలని అనుకుంటున్నావనా నీ అభిప్రాయం." పద్మ ముఖం తుడుచుకుంటూ అంది. "లేదు డాక్టర్. బహుశా మీకన్నా, మీసంగతి నాకెక్కువ తెలుసని ఈ నిమిషంలో కూడా నేను అనుకుంటున్నాను. ఆయనకే అపాయం రాకుండా మీరు అన్ని ప్రయత్నాలు చేస్తారనికూడా నాకు బాగానమ్మకం."

'పల్స్' చాలా బలహీనంగావుంది. ఏదో పని చూసుకుంటున్న హౌస్‌సర్జనుద్దేశించి అన్నాను, "డాక్టర్ బ్లడ్ గ్రూపింగు చేసారా?"

"చేశామండీ"

"ఏ గ్రూపో నోట్‌చేసారా,

" 'ఓ' గ్రూపు సార్. కాని రక్తం ఎక్కించటానికి ఆ గ్రూప్ బ్లడ్ లేదండి. గ్రూపింగ్ చెయ్యగానే బ్లడ్‌బ్యాంకుకు

కూడా వెళ్ళి చూచివచ్చాం." పిడుగులాంటి వార్త హౌస్ సర్జను చెప్పగానే నిమిషంసేపు బుర్ర కాళీ అయింది. ఏ ఆలోచన రాలేదు. ఏంచెయ్యాలో తోచలేదు.

ఆయన పరిస్థితా ఏమీ బాగోలేదు. రక్తం ఎక్కించకపోతే బ్రతుకుతాడన్నది కల్ల. పద్మవైపు చూసాను. నావైపే దీనంగా చూస్తూవుంది.

"ఓ పనిచెయ్యండి డాక్టర్. ఊర్లోవున్న ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ లన్నిటికీ ఫోను చెయ్యండి. 'ఓ' గ్రూపుదొరుకుం దేమో ఒకవేళ దొరికేటట్లయితే నా కారులోవెళ్ళి వెంటనే తీసుకు రండి." నేను చెప్పేనోలేదో హౌస్ సర్జను ఫోను చెయ్యటానికి వెళ్లాడు. సలైను సెట్టులోంచి సరిగ్గా బొట్లుపడకపోతుంటే సర్దుతూ నించున్నాను. "లాభంలేదు సార్. ఫోను రిసీవుచేసు కునేవాళ్ళే లేరసలు. ఫోనందుకున్న ఒకతను 'ఓ' గ్రూపు లేదన్నాడు". ఏడుపు ముఖంతో ఏంచేసేదన్నట్లు హౌస్ సర్జను వచ్చి చెప్పాడు.

ఆయన వైపొకసారి చూసాను. చావుబ్రతుకులమధ్య వూగిసలాడుతున్నాడు. రక్తం ఇవ్వకపోతే అవే ఆఖరు క్షణాలు కాగలవు. ఏం చెయ్యాలి... నేనేం చెయ్యాలి. ఇలా చూస్తూవుండగానే ఎవరికీ దక్కకుండాపోతాడా? చేతగాని వాడిలా; సమయం దొరికినప్పుడు పాత పగ తీర్చుకుంటున్న వాడిలా; ఘోరమైన అపరాధం చేసినవాడిలాగ పద్మ ముందు

నిలబడవలసి వస్తుందా? మనస్సులోనే దేవుడికి చెయ్యెత్తి నమస్కారం పెట్టాను.

ఒక్క మెరుపు మెరిసినట్లుగా బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది. వెంటనే గట్టిగా అరిచేను, "డాక్టర్ నాతో పాటు బ్లడ్ బ్యాంకుకురండి.క్విక్. వచ్చేటప్పుడు క్రాస్ మేచింగ్ కోసం ఓ చిన్న బాటిల్ బ్లడ్ తీసుకురండి అతనిది. పద్మా, భయమేమీలేదు. ఏది ఏమయినా ఆయన్ని తప్పక బ్రతికిస్తాను....బ్రతికించి తీరతాను....అవును పద్మా, ఆయన తప్పక బ్రతుకుతాడు". నే నెందుకు పిలిచేనో అర్థంగాని ఆ హౌస్ సర్జను ఆశ్చర్యంలో నన్నడగడానికి ధైర్యంచాలక నేను ముందుకు వెళ్తూంటే నా వెనకే వెంబడించి రాసాగేడు.

నా చేతినుంచి రక్తం తీయించాను. పరీక్షల అనంతరము నా రక్తం అతనికివ్వవచ్చని తేలింది. నావైపు ఇంకా అలానేచూస్తుండే హౌస్‌సర్జను మాత్రం మెల్లగా అడిగేడు, 'సార్ మీరు బ్లడ్ డొనేట్ చేస్తారా?" అతనివైపే చూసాను. కాని ఏం మాట్లాడలేదు. దీర్ఘంగా ఆలోచిస్తున్నాను. ఏమీ సమాధాన మివ్వకుండా అతనివైపే అలా చూస్తూ నిలబడిపోయాను....ఆలోచిస్తున్నాను. దీర్ఘంగా ఆలోచిస్తున్నాను. లక్ష్మి....పద్మ....కమల....అమ్మ....నాన్న.

వీళ్ళందరి బొమ్మలు మనస్సులోంచి మాయమవక ముందే వార్డులోని ముసలమ్మ జ్ఞాపకం వచ్చింది. "ఒక్కడే

కొడుకు నాయనా, వాడి నెలాగయినా మీరే రక్షించాలి." కాళ్ళుపట్టుకుని బ్రతిమిలాడుతున్నట్లనిపించింది. ఈపాటికి అతని పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారయి వుంటుంది. కనీసం నాడిని చూస్తుండమని మరో డాక్టరుకయినా అప్పచెప్పి వచ్చి వుండవలసింది నేను. నేను తిరిగి వెళ్ళేటప్పటికి అతను బ్రతికి వుంటాడా? అతని బొందిలో మిగిలిన కాస్త ప్రాణాన్ని ఆప గల్గటానికి నేను చేసే ప్రయత్నాలన్నీ ఫలిస్తాయా? ఆ ముసలవ్వకు ఎలాగయినా అతడిని బ్రతికిస్తానని నేనిచ్చిన మాట నిలబెట్టుకోగలనా? నాప్రయత్నాలన్నిటికి దైవం అనుకూలిస్తాడా! వీటిలో ఏ ఒక్కటి జరగాలన్నా నేను తక్షణమే వార్డుకు పోవాలి.

ఊహలోంచి మేల్కొని తర్వాత పద్మ గురించి మళ్ళీ ఆలోచించటానికి మనస్సు ఇష్టపడపోయినా ఒక్క క్షణం నా ఆలోచనలో పద్మ, నా మనస్సులో ఆమె రూపం ఆక్రమించుకున్నాయి. పద్మ....అవును పద్మ; ప్రేమలోని మాధుర్యం రుచి చూపించింది. చూపిస్తూనే నన్ను పిచ్చివాడినిచేసి మరీ పోయింది. ఏవిధంగా ఆలోచించినా నావిషయమంతా విన్న వాళ్ళు తమఅభిప్రాయాన్ని వెలిబుచ్చినా, పద్మనన్ను మోసం చేసిందనే అంటారు. అయినా ఈక్షణంలో నయినా పద్మలో మిగిలిన దేమిటి? స్వార్థంకదూ! అనుకోకుండా నేనుకన్పించినా నాసంగతి ఆలోచించి వుంటుందా? నేనేమయ్యానో ఎలా వున్నానోకూడా ఆమెకు పట్టేయా? తనభర్త ఎలాగయినా

బ్రతకాలి. అతనిని బ్రతికించుకోటానికి ఏం చెయ్యటానికి కూడ తను వెనుదీయదేమో. అతని కేమవుతుందన్న ఆతృత మాత్రమే ప్రస్తుతం ఆమెలో మిగిలింది.

నేనే రక్తదానంచేస్తే... అవును, అతను తప్పకుండా బ్రతుకుతాడు. బ్రతికి....నవ్వొచ్చిందినాకు. మళ్ళీ నన్ను ఒంటరివాడినిచేసి పాత అనుభవాలతో, అనుభూతులతో కృంగి కృశించి క్రుళ్ళిపొమ్మని వాళ్ళదారిన వాళ్ళు వెళ్ళిపోతారు. నాదనుకున్న పద్మను పరాయిదానిగ చూడగల్గి ఇంకా జీవించి వున్నానంటేనే ఆశ్చర్యంగావుంది. కనీసం ఆ వూహ వచ్చినప్పుడే భరించలేకపోయేవాడిని. పద్మే నాకుకాకుండా పోయినప్పుడు అతనేం అవుతాడు గనుక. నే నెందుకు రక్తదానం చెయ్యాలి. నాలోనూ స్వార్థంవుంది....నాలోనూ పగవుంది. పద్మ నాకు చేసిన మోసానికి నమ్మించి చేసిన ద్రోహానికి ఇదే మంచి సమయం. ఈ సమయాన్ని వదలుకున్నట్లయితే నాకింకెప్పుడూ పద్మను సాధించడానికి అవకాశమే రాకపోవచ్చు. అయినా అతను బ్రతకకపోతే నాకేం. ఆ లెక్కకొస్తే పద్మకు మాత్రమేం. ఆమె హృదయం చాలా విశాలమైంది. ఈనాడతను దూరమయినా త్వరలోనే తన హృదయాన్ని మరొకడికి అర్పించగలదు. కాకపోతే మరేమిటి? ఏ ఆడదయినా తన జీవితంలో ఒక్కడినితప్ప ప్రేమించలేదన్న నమ్మకం ఈనాటికీ నాలోవుంది. కాని నేను ప్రత్యక్షంగా చూసేదేమిటి? ఏ ప్రేమనయితే ఒకరిమీద గుప్పించిందో, ఎవరు

లేకపోతే తన జీవితం ముగుస్తుందని చెప్పిందో, ఆ వ్యక్తిగా నేను దూరమయినా, ఈ క్రొత్త వ్యక్తితో పెళ్ళనబడే ఒక బంధంలో చిక్కుకున్నంత మాత్రాన అలానే వుండగల్గుతుందంటే పద్మను ఒక ఆడదానిగా లెక్కవేయాలా నేను.

చావు బ్రతుకులమధ్య వూగిసలాడే అతనికోసం అలా పరితపించిపోతుందే!.... ఒకనాడు హఠాత్తుగా నా గుండెల్ని పిండుతూ, నా ఆశలు అడియాశలుచేసి శాశ్వతంగా నా జీవితంలోంచి తప్పుకుంటూ నే నేమవుతానో కనీసం ఆలోచించి వుంటుందా పద్మ. కాని స్వార్థంతో కరుడుకట్టిన ఆ పాషాణ హృదయి జీవితంలో తిరిగి పన్నీటిజల్లులు కురిపించాలా నేను.

వీల్లేదు....అలా జరగటానికి వీల్లేదు. ఈ రక్తదానం చేస్తూండే సమయంలో వార్డులోని ఆ రోగి ఏమవుతున్నాడో తెలియదు. జీవితంలో సర్వస్వాన్ని పోగొట్టుకొని మిగిలిన ఒక్కకొడుకు కోసం కళ్ళలో వత్తులువేసుకుని కనిపెట్టుకుని వుండే ఆ ముసలమ్మ గతే కావాలి. ఒకవేళ ఏదైతే జరుగకూడదని అనుకుంటున్నానో అదే జరిగితే ఆ ముసలమ్మను చూసేవాళ్ళెవరు? పైగా ఆమెకు నేనిచ్చిన మాట ఏంకావాలి?

ఉన్నట్లుండి కమల పెద్దగా నవ్వుతున్నట్లనిపించింది. "నువ్వెంత పిచ్చివాడి వన్నయ్యా. కొద్దిక్షణాలక్రితమే నువ్వు నాకేం చెప్పావో గుర్తురావటంలేదా నీకు. నీ మాటల్తో నన్నేమని నమ్మించావో తెలుసా? నీలో త్యాగం మాత్రమే

మిగిలిందన్నావు. పద్మ ఎక్కడున్నా, ఎలావున్నా, ఆమె సుఖాన్నే కోరుకుంటానన్నావు. ఇదేనా నువ్వు కోరే ఆమె సుఖం. ఇలాంటి శ్రేయస్సేనా నువ్వెప్పుడూ వాంఛించేది. ఈక్షణాన ఆతని ప్రాణం నీచేతిలోనే వుందనుకో. బ్రతికించాలనుకుంటే చాలా ప్రయత్నం చేయాలి. కాదనుకుంటే ఆ కొద్ది ప్రాణం పోటానికి నీప్రమేయం ఆట్టే అవసరంకూడా లేదు. కాని నీ చదువు సంస్కారం ఈ సమయంలో ఏమయ్యాయి. పద్మంటే నీకుండే అభిమానం ప్రేమ ఏమయ్యాయి సమయందొరికిందని సాధిద్దామనుకుంటున్నావు కదూ? నీలోని రాక్షసత్వం మానవత్వాన్నే కబళిస్తావుంటే అలానే చూస్తూ వూరుకుంటావా. పైగా అందరి ప్రాణాన్ని రక్షించటానికి ప్రయత్నించే డాక్టరునని సగర్వంగా చెప్పుకుంటావే! పీడిత ప్రజలకోసమే బ్రతికి వున్నానంటావు.

ఈనాడు నీకు పద్మ ఏమవుతుందనేగా నీప్రశ్న. నువ్వన్నది మాత్రం నిజం. పద్మనీకు ఏనాడో ఏమీకాకుండా పోయింది. కాని ఈనాడు ఆమొక తోటిమానవురాలిగా మాత్రం నీముందు నించునుంది. అసహాయకురాలిగా నిన్ను ప్రార్థిస్తోంది. అతను ఎవరైనా కావచ్చు. నీచల్లని చేతిస్పర్శ కోసం తహతహలాడే రోగి మాత్రమే ఈక్షణం. అతడిని ఇప్పుడైనా, ఎప్పుడైనా ఓకరోగిగానే గుర్తించు; అలానే అతనిని రక్షించు.

నీవెన్నడయినా ఆమెను మనస్ఫూర్తిగా ప్రేమించినా ఈనాటికికూడా నీప్రేమ అలానే చెక్కుచెదరకుండా వుండినా, నీలోమాత్రం ఏచెడ్డతలపూ రానీయకు....అయినా నాకింకా నమ్మకం వుంది. నాఅన్నయ్య మంచివాడన్న నమ్మకంవుంది. నాఅన్నలో మానవత్వం ఎన్నికాలాలకైనా మూర్తిభవించే వుంటుందని, వుండాలని నాకోరిక. లే అన్నయ్యా .... నీ రక్తాన్నతనికిపంచు. పంచి అతనిని బ్రతికించు. కళ్ళవెంట కారిన కన్నీటిధారను తుడుచుకొని 'బెడ్' మీదపడుకుంటూ అన్నాను. "నన్ను 'బ్లీడ్' చెయ్యండి డాక్టర్. చేసేముందు మావార్డుకు ఫోనుచేసి అక్కడ కమలనే సిస్టరు వుంటారు నేను రమ్మన్నానని వెంటనే 'బ్లడ్‌బ్యాంక్' కి రమ్మని చెప్పండి."

నా శరీరంనుండి సీసాలో పడే ప్రతినెత్తురుబొట్టును చూస్తూ ఏదో ఆలోచించుకుంటూవుంటే నాకెక్కడాలేని ఆనందంతో వుక్కిరిబిక్కిరయ్యాను. ప్రతిబొట్టును చూసినప్పు డల్లా ..."అతను బ్రతకాలి...., తప్పకుండాబ్రతకాలి. నాపద్మ ఇంతకుముందెంత ఆనందంగా వుండేదో దానికి రెట్టింపు సుఖంగా వుండాలి. ఆమె జీవితానికి నేను చేసిన మహోపకారం తలచుకోక పోయినా, నా ఈ చిన్న సహాయంవల్ల ఆమె జీవిత పునాది గట్టిపడితే, ఆమె భర్తతో నాలుగు కాలాల పాటు సుఖపడితే నాకంతేచాలు. అప్పుడుగాని నాజీవితానికో అర్థమంటూ కన్పించదు.

"ఒకబాటిల్" నిండా తీసాను. ఆపమంటారాసార్" అప్పటికే శరీరంలో ఏదో నిస్సత్తువ ఏర్పడింది. నుదుట చిరు చెమట పోస్తూవుంది. కళ్ళు గాలిలో తేలిపోతున్నాయి. నోట్లో తడారిపోయింది. ఏమీ మాట్లాడలేకపోయాను.

కాని అతనంతటితో ఆపేస్తాడేమోనని భయపడ్డాను. లేనిశక్తిని కూడదీసుకుని అన్నాను. "ఆపకండి డాక్టర్, కనీసం ఇంకో రెండువందల సీ. సీ. లు 'బ్లీడ్' చెయ్యండి. నాకేం ఫరవాలేదు. బాగానే వున్నాను. బ్లీడింగవగానే వెంటనే 'క్యాజయాలిటీ' కెళ్ళి రక్తం ఎక్కించటం ప్రారంభించండి. నేనుకొంచెంసేపు విశ్రాంతి తీసుకునిగాని రాలేను.

అప్పుడే బ్లడ్‌బ్యాంకులో అడుగుపెట్టిన కమల నా కళ్ళలో నీరునిండివుండటంవల్ల మసగ్గా కన్పించింది. ఆమె ముఖంలో కళలేదు. వాడిపోయివుంది. ఏదోబాధపడుతున్న ట్లనిపించిందినాకు.

"ఏం ఫరవాలేదు కమలా. ఈమాత్రం 'బ్లడ్' ఇచ్చినందుకు నాకేమవుతుంది. ఓ అరగంట విశ్రాంతి తీసుకోగల్గితే మళ్ళీనేను లేచి తిరగగలను అంతే. దానికే అధైర్య పడతావే. ఇంతకీ నా 'పేషెంటు'లా వున్నాడు".

కమలకు నోటివెంట మాటరాలేదు. నేను ఆమెనోటి వెంట ఏసమాధానం వస్తుందా అని ఎదురు చూస్తున్నా.

తప్పదనుకున్నట్లుగా చివరకు కమల "సారీ అన్నయ్యా. ధియేటరుకు తీసుకుని వెళ్తూవుంటే మధ్యలోనే అతనిప్రాణం పోయింది. నువ్వు వార్డులోవుంటే బహుశా ఇలా జరిగివుండేది కాదేమో" అన్నది.

అప్రయత్నంగా కళ్ళవెంట బొటబొటా కన్నీరుకారింది. గుండెలో ఏదో బరువు ఎత్తినట్లయింది. "ఆతల్లెలా ఏడుస్తూ వుందో చెప్పటానికి నాకు నోరు రావటంలేదు. అసలా విషాద వార్త వినటంతోటే స్పృహతప్పిపడిపోయింది. తేరుకునేటప్ప టికి కనీసం పదినిముషాలయినా పట్టేవుంటుంది. కోలుకున్న మరుక్షణమే మనమంతా చేరే తన కొడుకుని చంపేశామని గట్టిగా ఏడవటం మొదలెట్టింది. వార్డులో అందరూ ఆగొడ వకు లేచి కూర్చున్నారు. ఆమెను వూరుకో బెట్టటంమాత్రం నాకుచేత కాలేదు. అంతలో ఫోను వస్తే ఇలావచ్చాను." కమల చెప్పేమాటలు విన్పిస్తూనే వున్నాయి.

"భగవంతుడా ఎందుకు నాకీ పరీక్ష. నేనుచేసిం దేమిటి? ఒకర్ని రక్షించబోయి మరొకళ్ళను చంపేశాను. నాప్రయ త్నాలన్నీ ఫలించి కనీసం ఇతనయినా బ్రతుకుతాడా?" మన స్సులో అలా అనుకుంటూనే పైకిమాత్రం "కమలా నేను నా డ్యూటీ రూంకువెళ్ళి విశ్రాంతి తీసుకుంటాను. నువ్వు మాత్రం 'క్యాజుయాలిటి'కి వెళ్ళి ఆ 'యాక్సిడెంటు' జరిగిన పేషెంటు దగ్గరేవుండు. అతని పరిస్థితి ఎలావున్నదీ తరచు ఫోనుచేస్తూవుండు. పద్మకిమాత్రం నేనే ఈరక్తదానాన్ని చేసే

ననిమాత్రం చెప్పకు. కనీసం ఇంకెవరయినా అలా చెప్ప కుండాకూడా జాగ్రత్తపడు...." అర్థంగాకుండా నావైపే చూపే కమలతో మళ్ళీ అన్నాను.

"ఒకవిధంగా పద్మను తిరిగి ఈ జన్మలో కలుసుకో వస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు, కలలో కూడా. కాని ప్రాణాపాయస్థితిలోవున్న ఆమె భర్తను కాపాడమని నన్ను పదేపదే ప్రార్థిస్తుందనేదికూడా వూహించరాని విషయం. అయినా నా ఈరక్తంవల్ల అతనుబ్రతకగల్గితే. పద్మజీవితంలో నూతన శకంతోపాటు ఆరని జ్యోతినికూడా వెలిగించిన వాడి నవుతాను. కాని నేనుచేసింది త్యాగమని ఎవరైనాఅంటే అటువంటి త్యాగం ఎవ్వరికీ తెలియవలసిన పనిలేదు. ఎందు కంటావేమో. ఈక్షణంలో నేను ఆమె అంతటి త్యాగానికి అనర్హూరాలని చెప్పగలను. కాని ఈత్యాగం నాలోఇంకా మిగిలివున్న మానవత్వానికి, ప్రేమకు చిహ్నం మాత్రమే. వెళ్తున్నా కమలా.... నేను తిరిగి పద్మఎదురుగావచ్చి నిలబడ లేను. ఒకవేళ మళ్ళీ ఆమెను చూడటం సంభవిస్తే నా గుండె ముక్కలయిపోతుందేమో. నేనక్కడికిరాలేకపోయినా నామనస్సంతా ఇక్కడే వుంటుంది. ఏదైనా అవసరమొస్తే ఫోనుచేస్తూవుండు, అక్కడేవుండి సలహా ఇస్తూవుంటాను." నడవలేక ఒక్కొక్క అడుగే మెల్లగా వేస్తూ వెళ్తూంటే నన్నే చూస్తూ నిలబడిపోయింది కమల.

మావార్డువైపు వెళ్తూ దూరంనుంచే, తలను గోడకు

బాదుకొని ఏడ్చే ఆముసలమ్మను చూసాను. ఆదృశ్యాన్ని చూడలేక కళ్ళు మూసుకున్నాను. నేననుకున్న ఆపరేషనే చేసివుంటే అతను తప్పకుండా బ్రతికి వుండేవాడు. అతనే బ్రతికివుంటే ఈముసలిదానిజీవితం వేరోవిధంగా జరగబోయేదికదూ! ఆమె కంతకన్నా సాధించేదికూడా ఏమీ మిగిలివుండేదికాదు.

నారూంకు వెళ్ళికూడా జరిగిన సంగతులన్నిటినీ నెమరువేసుకుంటూ పడుకున్నాను. నేను ఇంతవరకు చేసిందేమిటి? తాత్కాలికంగా కొందరిబాధలుపశమింపజేసి వుండవచ్చు. కొందరి జీవితాలనే రక్షించివుండవచ్చు. కాని ఇప్పుడుమాత్రం నీడనిచ్చే మహావృక్షాన్ని వ్రేళ్ళతోసహా పీకివేసి, ఓచిన్న మొక్కను నాటాను దాని స్థానంలో. ఈనాడు పద్మభర్త బ్రతకనంతమాత్రాన పోయిందేమిటి. పద్మ మానసికంగా ఎంతో మారిపోయేది కొన్నాళ్ళవరకు. కాని ఆదిగులుఆబాధ ఎన్నాళ్ళో వుండవు. ముసలమ్మ బ్రతికినంత కాలం ప్రతిక్షణం ఒకయుగంలా గడుపుకుంటూ జీవించాలి పాపం నాఅశ్రద్ధ ఫలితమా అని. ఎందర్నో, ఎవర్నో తిట్టటం ఎందుకు. నాలోమట్టుకు స్వార్థం లేదూ? నాపద్మ బాగుంటే చాలనుకున్న ఆవెధవ క్షణాలలో ముసలమ్మంటే ఎంతవుదాసీనత వచ్చింది. ఒకవేళనేనే ఆమెకొడుకుచావుకు కారణమని తెలిస్తే ఆముసల్ది నన్నుజీవితంలో క్షమించగల్గుతుందా. భగవంతుడా నాకీజీవితం వద్దు; ఈపనీవద్దు ఏమీవద్దు ఎవరి

కోసమైతే ఈజీవితాన్ని స్వార్థరహితమైన సేవలతో అంకితం చేసానో అటువంటి పీడిత ప్రజానీకమే నాకు మిగలనప్పుడు నా ఈజీవితానికే కాదు ఈవృత్తికి మాత్రం అర్థమెక్కడ? ఎవరేమని అనుకున్నా నేనుమాత్రం ఈవృత్తికి తగను,.... అవును ఈవృత్తి నాకు లాభంలేదు, పైపెచ్చు ఈవృత్తిలో రాణించలేను. అందుకనే ఇక్కడనుంచి వెళ్ళిపోవాలి....అవును వెళ్ళిపోవాలి.

ఇలా ఆలోచిస్తూ ఎప్పుడు కళ్ళుమూసానో తెలియదు. ఫోను రింగయిన శబ్దావిని త్రుళ్ళిపడి లేచాను. పద్మభర్త కోలుకుంటున్నాడని కమల ఫోనులో చెప్పింది. వినిఓనిట్టూర్పు మాత్రం వదిలాను.

ఆమరుసటిరోజు సెలవు పెట్టేశాను. రాత్రిపుడు హాస్పటల్ వైపువెళ్ళి మావార్డుకు వెళ్లాను. కమల ఒక్కతేవుంది. వార్డంతా నిశ్శబ్దంగావుంది. "ఇవ్వాళ సెలవు పెట్టారటగా అన్నయ్యా" అని అడిగింది కమల.

"సెలవుమాత్రమే కాదుకమలా. ఉద్యోగానికే రాజీనామా ఇచ్చేశాను." కమల విస్తుపోయినట్లుంది నోటివెంట మాటే రాలేదు.

"నిజం కమలా. నేనీవృత్తికిపనికిరానని నాకనిపిస్తోంది. ఎవరికోసం జీవించాలో అర్థంకాని రోజుల్లో ఈ రోగులకు నిస్వార్థసేవ చెయ్యటంలో జీవితం గడచిపోతుందనిఆశించాను.

నాపిచ్చిగాని నాస్వార్థం నీడలా నన్ను వెన్నంటే వుంటుంది. పద్మను నాదానిగా ఎప్పుడూ అనుకోబట్టే ఏదో త్యాగం చేస్తున్నానన్న భావంతో ఒకనిండు ప్రాణాన్ని అన్యాయంగా బలిచేసాను. ఆకన్నకడుపుకోత నాహృదయాన్నె రాచిరంపాన పెట్టగలదన్న భావం నాకప్పుడు తట్టలేదు. ఈచిన్న సంఘ టనే నాకు మనశ్శాంతిలేకుండా చేస్తోంది. అందువల్లనే ఈ రోజునుంచి డాక్టరుగా వుండదలచుకోలేదు. నేనుబ్రతికుండగా మళ్ళీ నేనీ వృత్తిలో అడుగుపెట్టను. ఇక్కడకువచ్చేముందు పద్మభర్త బాగానే వున్నాడని విన్నాను. హాస్పటల్లోనుంచి పోబోయేముందు పద్మఎప్పుడయినా నాసంగతి అడిగితే 'నేను లేనని, బహుశా ఇంకెప్పుడూ తనని నేను చూడటమంటూ జరగదని మాత్రం చెప్పు.' పోయేముందు నాదో చిన్నకోరిక మిగిలింది. ఇదిగో ఈకాగితంలో నాఅడ్రసువుంది అప్పు డప్పుడూ వుత్తరాలు రాస్తూవుంటావుకదూ. కమలా....మన పరిచయం కేవలం కొన్నిగంటలక్రితమే జరిగినా నాకు మాత్రం ఎన్నోయుగాలనాటి అనుబంధమేమోననిపిస్తూవుంది. మిగిలిన జీవితంలో నిన్నెప్పుడూ మర్చిపోవటమంటూ జర గదు....మరి వెళ్ళిరానా?" అయినా కదలకుండా అక్కడే నిల్చున్నాను.

"మీమాటలు వింటూవుంటే నాకేం చెప్పాలన్నా భయంగానేవుంది. అయినా అదేంటన్నయ్యా. మనకు చేత నయినంతవరకు మాత్రమేమనం చేయగల్గుతాం, అంతే.

ఆయువుతీరిన మరుక్షణం మనంవుండమన్నా వుంటారా, మనం ఎన్ని చేసినా దక్కుతారా? మీఅజాగ్రత్తవల్ల ఒకతను నిష్కారణంగా పోయాడన్న బాధ మీకయితే వుండవచ్చు. కాదనను, కాని ఆకారణంవల్ల దైవత్వంతో సమానమయిన ఈవృత్తిని విడనాడటంలో నాకు సబబేమీ కన్పించటంలేదు. తెలిసిన వాళ్లెవరూ ఈవిషయాన్ని హర్షించలేరు. నామాట విని మీరు రాజీనామా వుపసంహరించుకోండి'' కమల అడిగినదానికి సమాధానమిచ్చాను చల్లగా.

"నువ్వు నన్నర్థం చేసుకోలేవు చెల్లీ. నేనీవుద్యోగంలో వుండి ఇక్కక్షణమాత్రం అసలుండలేను. అలా అని మరో చోటయినా ఇదే డాక్టరుపని చెయ్యలేను. ఈవృత్తివల్ల నామనస్సుకు శాంతనేది కరువవుతుందని నాకు బాగా తెలుసు. ఇలానే మరోరోజు జరిగితే నేను బ్రతకననికూడా తెలుసు. హాయిగా వ్యవసాయం చేసుకుంటూ, పండినదాంట్లోనే తింటూ, వున్నఇంట్లో నేవుంటూ ఈజీవితాన్ని యిలానే గడుపుతాను. దాంట్లోనే నేను నిత్యమూ అన్వేషించే శాంతి, సౌఖ్యం దొరుకుతాయేమో కాని మాప్రాణుపోయేముందు కొన్ని ప్రదేశాలు తిరిగివద్దామనివుంది. నాఈ నిశ్చయాలన్నిటినీ దేవుడుకూడా మార్చలేడు...'' వీడ్కోలు తీసుకుంటూ వుంటే కమల కళ్ళలోంచి కన్నీరు బొటబొటా కారింది.

అలా ఆవూరుని వదలివెళ్ళిననేను. ఎన్నెన్ని ప్రదేశాలు తిరిగేనో, తేరుకోటానికి ఎన్నిరోజులుపట్టింది నాకిప్పుడు గుర్తులేదు.

“మీచేతిలోని వుత్తరం ఎగిరి ఇక్కడపడి చాలా సేపయింది బాబూ; లేచి తీసుకున్నారేమోనని అనుకున్నా. ఇంకా ఇక్కడేవుంది ... బాబుగారు ఏదోపరధ్యానంలోవున్నట్లున్నారే....” భీముడు కమలరాసిన ఉత్తరాన్ని చేతికందిస్తూ చిరునవ్వునవ్వాడు,

“అందుకనే అన్ని విషయాలు మీకురాస్తున్నాను..... ఆరాత్రిమీరు వార్డువదలి వెళ్ళిన దగ్గరనుంచి నాకేమి తోచలేదు. ఆప్తులు దూరమయినంత బాధపడ్డాను. పద్మభర్త ఎలావున్నాడో మాటిమాటికి వెళ్ళి చూసివస్తూండేదాన్ని. అన్నిసార్లు పద్మ ఆయన ప్రక్కనే కూర్చునివుండటం గమనించాను. అప్పుడుపద్మ నన్నేమి అడగలేదు. హాస్పటల్‌నుంచి డిస్చార్జ్ అయినప్పుడుమాత్రం “ఈవార్డు డాక్టరు రవి ఎక్కడుంటారో చెప్పగలరా”అని నన్ను అడగబట్టె మీరుచెప్పినట్లె చెప్పాను. అదివిని ఆమె ఏపాటి అసంతృప్తిచెందలేదని చూడటానికి ఆశ్చర్యంవేసింది. మీరారాధించినపద్మ.... మీ వలపు దేవత ఈమేనా అని అనిపించిందినాకు. ఇది కొన్ని సంవత్సరాలనాటి సంగతే అనుకోండి.

కాని ఈమధ్య సంగతికూడా రాయాలికదూ నేను. 'డెలివరీ' జరిగిన మూడో రోజున హాస్పటల్‌నుంచి పద్మను డిస్చార్జ్ చేసారు. వెళ్ళబోతూ నా రెండు చేతుల్ని దగ్గరకు తీసుకుని 'థాంక్స్ సిస్టర్' అన్నది. అప్పుడామెభర్త దగ్గర లేడు. 'బాబుపేరేం పెడతారు' అని నేనే మాటల్ని పెంచుతూ అడిగేను. ఆమె ఎక్కడాలేని నవ్వుని ముఖంమీదికి తెచ్చి పెట్టుకుని అంది "ఇప్పుడేం చెప్పను? అయినా అంతా ఆయన ఇష్టం. బాబుపుడితే ఆయనకు, పాపపుడితే నాకుఅనుకున్నాం. బాబు ఆయనకే చెందుతాడు కాబట్టి బాబు విషయమంతా ఆయనే పట్టించుకోవాలి. అందుకని ఆయనేం పేరుపెడితేఅదే"

"కాని బాబునిచూస్తుంటే నాకోపేరు సూచించాలని అనిపిస్తూవుంది. చెప్పమంటారా? చెప్పమన్నట్లు నావైపుచూడగానే చెప్పాను. "రవిబాబు" పేరుచెప్తూ ఆమెముఖంలోకి పరీక్షగా చూశాను. పేరువినగానే ఆమెముఖంపాలిపోయింది. నేనేమళ్ళీ అన్నాను. "నాకంతా తెలుసుపద్మా, మీనుండి ఒక రహస్యాన్ని ఇన్నాళ్ళుదాచాను. చెప్పటానికి సమయం అవకాశంవున్నరోజున నానోరు మూతపడింది అసహాయశాలిగా. చెప్పాలని అనుకున్నరోజున నాకు అవకాశం చిక్కలేదు. ఈక్షణాన్ని నేను వుపయోగించుకోలేకపోతే నేనీవిషయాన్ని జీవితంలో ఇంకెప్పుడూ చెప్పలేనేమో ననిపిస్తూవుంది.

ఈనాడు మీజీవితం మూడుపువ్వులు ఆరుకాయ

లగా వర్ధిల్లుతూవుండంటే దీనివెనక ఒక మహావ్యక్తిత్యాగం. ఆయన నిష్కల్మషమైనప్రేమ ఎప్పుడూ వుంటున్నాయన్న సత్యం మీకర్థంకాదు. డాక్టర్ రవి ఈనాటికీ మిమ్మల్ని తన ప్రాణంకన్న ఎక్కువగా ప్రేమిస్తూనే వున్నాడు. బహుశా ఆప్రేమకు ముసలితనం....చావు లేవేమోకూడా. ఆయనలో ఆభావం ఇంకా వుండటం ఇతరులకు ఎబ్బెట్టుగా కన్పించినా మీవిషయంలో మాత్రం మీఅదృష్టమనే చెప్పవలసివస్తుంది నాకు. అంతవరకు తనకంటికి రెప్పలా కాపాడుకునే రోగిని సహితం వదలుకుని, తనపద్మ ఏనాటికీ విచారించవలసిన పరిస్థితే రాకూడదని తన రక్తాన్నికూడా ధారబోసి మీఇంటిదీపం ఆరిపోకుండా ప్రయత్నించే సమయంలో తనరోగిని పోగొట్టుకుని ఆదిగులుతోనే తన జీవితాన్నే నాశనంచేసుకున్ననిస్వార్థజీవి డాక్టర్ రవి. రవి అన్నయ్య ఇతరులకోసమే బ్రతికాడు. ఇతరుల ఆనందమే తనఆనందమని తలిచేడు. మిమ్మల్నిప్రేమించినందువల్ల ఆయనకు లభించినవరం.... చెప్పమంటారా; అదే ఒంటరితనం. తనవాళ్ళని అనుకున్న వాళ్లెవరూ మిగలకపోగా వాళ్ళవూళ్ళోనే ఒక సామాన్య రైతుగా ఒక వుదాత్తమైన జీవితాన్ని గడిపే రవి అన్నయ్యలాంటి మనస్సు ఈ బాబుకి కూడా రావాలని అనుకుంటే. మీరూ అలానే కోరుకుంటే బాబుకి 'రవి' అనిపేరు పెట్టండి పద్మా..." ఆవేశంలో మాటలు తడబడ్డాయి. మాన్నైసే వచ్చే భీమశంకరం కనబడటంలో సంభాషణ అంతటితో ఆగిపోయింది. పద్మ దగ్గరనుంచి

తర్వాత కొన్నిరోజులకి పుత్తరం వచ్చింది బాబుపేరు 'రవి బాబు' గా పెట్టమని.

చాలా పెద్దపుత్తరం రాసాను. ముగించేముందు ఒక్క-మాటమాత్రం రాస్తున్నాను. సలహామాత్రం కాదుసుమా. మీఅమూల్యమైన సేవలను అనేక కాలాలపాటు అందుకోటానికి అనేకమంది వ్యాధిగ్రస్తులున్నారు. వారందరికీ నీచల్లటి కరస్పర్శ కావాలి. మనిషన్నతర్వాత ప్రతివాడిని సంతోష పెట్టగల సామర్థ్యం ఎవ్వరికీ వుండదు. మీరు చేసింది, మీకు జరిగింది తప్పూకాదు—అలా జరగకూడదనీకాదు. జరిగినదంతా ఒకపీడకలగా మర్చిపోయి కనీసం మీవూర్లోనయినా ప్రాక్టీసు మొదలు పెడతారని ఆశిస్తున్నాను. క్రిందరాసిన అడ్రసుకు జవాబిస్తారు కదూ? ఎదురు చూస్తూంటా

మీచెల్లి,

కమల

సిగరెట్టు ముట్టించి గట్టిగా దమ్ము పీల్చాను. కిటికీరెక్క-తెరిచి ఆకాశంవైపు చూసాను. జల్లుపడటం ఎప్పుడో ఆగినట్లుంది. కాని కారుమేఘాలు దట్టంగా ఆకాశాన్ని అంటి పెట్టుకునే వున్నాయి.

కాఫీ కప్పును తీయటానికివచ్చిన భీమన్ననుద్దేశించి "భీమన్నా.... రేపటినుంచి నేనీవూర్లో ప్రాక్టీసు మొదలు పెట్టబోతున్నా" అనగానే నోరప్పగించి చూసేడు భీముడు.

"అవును భీముడూ నమ్మకంలేదా....అదిసరేగాని అలా పోయి రాముడింటికెళ్ళి వాడిపెళ్లాంకెలావుందో చూసివద్దాం. వర్షం మళ్ళీ ప్రారంభించకముందే".

"ఏమిటోబాబూ, ఇవ్వాళ నాచెవుల్ని నేనే నమ్మలేక పోతున్నా. బాబుగారిలో ఇంతమార్పు వస్తుందని నేనుకలలో కూడా అనుకోలేదు." నేను వెళ్తూవుంటే నా వెనకే భీమన్న సంచితీసుకుని వెంబడించాడు.

రాముడిఇల్లు సమీపించాను. వాడిఇంటిచుట్టు జనం ప్రోగయివున్నారు. దగ్గరకువెళ్ళి చూస్తుంటే దూరంగా ఆకాశంలో ఒక్క వురుమువురిమింది.

"బాబుగారా .... వచ్చారా! అవును లేండి మీరువస్తారని తెలుసు. అంతా అయిపోయినతర్వాత వస్తారనీ తెలుసు. ఏచేతుల్తో మిమ్మల్ని చిన్నప్పుడు ఎత్తుకుని పెంచానో, ఆ చేతుల్తోనే మీకాళ్ళను పట్టుకుని బ్రతిమిలాడినప్పుడు మీరాతి గుండె కరగలేదనికూడా తెలుసు. నాసీతనన్ను అన్యాయం చేసిపోయేటప్పుడు వీడికి మిగిలిందేమిటా అని తేలిచేయటానికి మీరంతా వస్తారనికూడా తెలుసు. ...పోండి....మీరంతా దూరంగాపోండి.... లేకపోతే సీతతోపాటు పరలోకానికి మిమ్మల్నందర్నీ పంపించేస్తాను...." సీతపోయిన దుఃఖములో పిచ్చివాడయిన రాముడంటే జాలిపడటం మినహా చేసేదేమిలేక వెనక్కుమళ్లాను.